JAYABHERIDAILY.COM
జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రభాత జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
మేడ్చల్ - మల్కాజిగిరి । ఆదివారం 26-07-2026
Medchal - Malkajgiri । Sunday 26-07-2026
Follow: jayabherinews
సంపుటి : 03 । సంచిక : 55
పేజీలు : 8 । వెల : 5
Vol. 03 । Issue 55 । Pages : 8 । ₹: 5

విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889
call me
jayabheripaper@gmail.com




## పీఎం మోదీ డీప్‌ఫేక్ వీడియోల కలకలం

- పాకిస్థాన్ ప్రచార ఖాతాలపై పీఐబీ ఆరోపణ
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ విద్యార్థుల నిరసనలపై చేసినట్లు చూపిస్తున్న వ్యాఖ్యలు పూర్తిగా కల్పితమైనవి
- ధర్మేంద్ర ప్రధాన్ అలాంటి వ్యాఖ్యలు ఎప్పుడూ చేయలేదని స్పష్టం

జయభేరి, న్యూఢిల్లీ:

దేశవ్యాప్తంగా నీట్‌యూజీ 2026 పేపర్ లీక్ వివాదం నేపథ్యంలో విద్యార్థుల నిరసనలు కొనసాగుతున్న వేళ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి పీయూష్ గోయల్, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పేర్లతో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియోలపై ప్రెస్ ఇన్ఫర్మేషన్ ...మిగతాది 2 లో



## 21 ఏళ్లకే ఎమ్మెల్యే.. ఎంపీగా పోటీ చేసే అవకాశం

- అసెంబ్లీలో ప్రత్యేక తీర్మానం: సీఎం రేవంత్
- చట్టసభల్లో యువతకు ప్రాతినిధ్యం
- మంత్రులుగా యువతే ఉండాలి

జయభేరి, హైదరాబాద్ :

నీట్ పరీక్షల లీకేజీకి వ్యతిరేకంగా ఢిల్లీలో జరిగిన పోరాటం గొప్ప విజయమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభివర్ణించారు. నేడు హైదరాబాద్‌లోని పీపుల్స్ ప్లాజా నుంచి పీవీ మార్గ్‌లోని ఇందిరాగాంధీ విగ్రహం వరకు నిర్వహించిన భారీ కొవ్వొత్తుల ర్యాలీలో ఆయన ప్రసంగించారు. జెన్‌జీ (GenZ) యువత 58 అంగుళాల ఛాతీని ఓడించి, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసేలా చేశారని ప్రశంసించారు. అయితే ఈ విజయం కేవలం రాజీనామాతో సరిపోదని, విద్యార్థులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు పరిహారం అందించాలన్నారు. ఈ విజయాన్ని కాంగ్రెస్ తన ఖాతాలో వేసుకోవడం లేదని, ఇది పూర్తిగా యువత సాధించిన విజయమేనని స్పష్టం చేశారు.

**అసెంబ్లీలో ప్రత్యేక తీర్మానం**

ఎంపీ, ఎమ్మెల్యేగా పోటీ చేసే కనీస వయసును 21 ఏళ్లకు తగ్గించాలని కోరుతూ ఆగస్టు మొదటి వారంలో అసెంబ్లీ, శాసనమండలి ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. ఈ మేరకు ఒక తీర్మానం చేసి కేంద్రానికి పంపిస్తామన్నారు. ఈ బిల్లును పార్లమెంటులో ఆమోదించేలా రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేల నాయకత్వంలో ఇండియా కూటమి కృషి చేస్తుందని హామీ ఇచ్చారు.

**చట్టసభల్లో యువతకు ప్రాతినిధ్యం**

దేశ భవిష్యత్తు యువతపైనే ...మిగతాది 2 లో



## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా..

- బాధ్యతల నుండి తప్పుకుంటూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి లేఖ
- రాజకీయాల కోసం విద్యార్థులను వాడుకోవద్దంటూ ఎమోషనల్ పోస్ట్!

జయభేరి, న్యూఢిల్లీ:

నీట్‌యుజి 2026 పరీక్ష అక్రమాల నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేశారు. విద్యార్థుల భవిష్యత్తు, దేశ ప్రయోజనాల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెబుతూ దేశ యువతకు ఎక్స్ (X) వేదికగా ఒక భావోద్వేగ లేఖ రాశారు. నీట్‌యుజి (NEETUG) 2026 పరీక్ష అక్రమాల నేపథ్యంలో తీవ్ర రాజకీయ దుమారం రేగుతున్న సమయంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేశారు. ఈ సందర్భంగా 'ఎక్స్' వేదికగా దేశ యువతకు ఆయన ఒక భావోద్వేగ లేఖ రాశారు. మే 3న జరిగిన నీట్ పరీక్షలో తలెత్తిన పొరపాట్లను ప్రభుత్వం తక్షణమే గుర్తించి సీబీఐ విచారణకు ఆదేశించిందని తెలిపారు. సీబీఐ విచారణ, జూన్ 21న తిరిగి కొత్త పరీక్ష నిర్వహణ, ఫలితాల విడుదల వరకు ప్రతి దశలోనూ తానే స్వయంగా బాధ్యత తీసుకున్నట్లు వెల్లడించారు. విద్యార్థుల ప్రయోజనాలు కాపాడటం, వారి కలలను నెరవేర్చడం తన నైతిక బాధ్యత అని పేర్కొన్నారు. రాజకీయం పేరుతో విద్యార్థుల భవిష్యత్తును కొందరు నాశనం చేయడానికి ప్రయత్నించడం తనను బాధించిందని, అందుకే ప్రధానికి లేఖ సమర్పించినట్లు తెలిపారు. వచ్చే సంవత్సరం నుండి నీట్ పరీక్షను కంప్యూటర్ ఆధారిత పద్ధతిలో (CBT) నిర్వహించాలని నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. దాదాపు 20 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు దృష్టిలో ఉంచుకుని అన్ని శాఖల సమన్వయంతో జూన్ 21న పరీక్ష విజయవంతంగా పూర్తి చేశామని చెప్పారు. ...మిగతాది 2 లో

## మేడ్చల్ జిల్లాలో ఘోర విషాదం..

- ఐదో అంతస్తు నుంచి దూకి మెడికల్ విద్యార్థిని దీక్షిత ఆత్మహత్య
- వారం క్రితమే బెంగళూరు నుంచి వచ్చింది.. ఇంతలోనే..
- చదువుల ఒత్తిడి వల్ల ఈ తీవ్ర నిర్ణయం తీసుకుందా?
- ఏదైనా వ్యక్తిగత లేదా కుటుంబ సమస్యలు కారణమా?



జయభేరి, మేడ్చల్ :

మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లాలోని కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో తీవ్ర విషాదకర సంఘటన చోటుచేసుకుంది. ఉన్నత చదువులు చదివి, భవిష్యత్తులో మంచి వైద్యురాలిగా సమాజానికి సేవ చేయాల్సిన ఒక యువ వైద్య విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. నాగారంలోని వెస్ట్ గాంధీనగర్ ప్రాంతంలో పీజీ వైద్య విద్యార్థిని దీక్షిత (26) తను ఉన్న భవనం ఐదో అంతస్తు నుంచి కిందకి దూకి ప్రాణాలు తీసుకుంది. ఈ ఊహించని ఘటనతో స్థానికులు, కుటుంబ సభ్యులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, నాగారం వెస్ట్ గాంధీనగర్‌లోని ఒక భవనం ఐదో అంతస్తు నుంచి హఠాత్తుగా దీక్షిత కింద పడిపోయింది. రక్తమడుగులో పడివున్న ఆమెను గమనించిన స్థానికులు వెంటనే అక్కడికి చేరుకున్నారు. ఐదో అంతస్తు నుంచి కింద పడటంతో తీవ్ర గాయాలపాలైన దీక్షిత అక్కడికక్కడే మృతి చెందింది. వెంటనే అప్రమత్తమైన స్థానిక ప్రజలు కీసర పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే కీసర పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఘటన స్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన పోలీసులు ప్రాథమిక ఆధారాలు సేకరించారు. అనంతరం మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు అన్ని కోణాల్లో సమగ్ర దర్యాప్తు చేపట్టారు. ఆత్మహత్యకు పాల్పడిన ...మిగతాది 2 లో



## ఇదే ప్రజాస్వామ్యం

- కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా
- విద్యార్థుల ఆందోళన మధ్య నిర్ణయం
- రాజీనామాపై స్పందించిన కేంద్ర మంత్రి బండి సంజయ్

జయభేరి, హైదరాబాద్ :

కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా దేశ రాజకీయాల్లో సంచలనం రేపుతోంది. నీట్ పేపర్ లీకేజ్ వ్యవహారం, ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ ఆందోళనల ...మిగతాది 2 లో

## ఏపీలో ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్మెంట్ వయసు 62కు పెంపు




జయభేరి, విజయవాడ, జూలై 25 :

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరోసారి ఉద్యోగుల పదవీ విరమణకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకుంది. తాజాగా శాప్ (రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ) ఉద్యోగుల పదవీ విరమణ వయసును 60 ఏళ్ల నుంచి 62 ఏళ్లకు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. శాప్‌లో పనిచేస్తున్న ఉద్యోగుల పదవీ విరమణ వయసును 60 నుంచి 62 ఏళ్లకు పెంచింది. 2022 జనవరి ఒకటో తేదీనన ప్రభుత్వం దీనిపై నిర్ణయం తీసుకోవడంతో.. ఇటీవల పదవీ విరమణ చేసిన ఎనిమిది మంది ఉద్యోగుల్ని తిరిగి విధుల్లోకి తీసుకుంటున్నట్లు శాప్ తెలిపింది. ఇటీవల ప్రభుత్వ రంగ సంస్థలు (PSUs), కార్పొరేషన్లు, సొసైటీలలో పనిచేస్తున్న పర్మినెంట్ ఉద్యోగుల పదవీవిరమణ వయసును 60 ఏళ్ల నుంచి 62 ఏళ్లకు పెంచింది. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం-2014 ప్రకారం షెడ్యూల్-9, షెడ్యూల్-10 పరిధిలోకి వచ్చే ప్రభుత్వ రంగ సంస్థలు, ...మిగతాది 2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా..

జూలై 16న వచ్చిన ఫలితాల్లో పేద వర్గాల పిల్లలు అద్భుత ప్రతిభ కనబరచడం తనకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని వివరించారు. కొందరు బాధ్యతాయుత పదవుల్లో ఉండి కూడా విద్యార్థులను తప్పుదారి పట్టించడానికి చూశారని ఆరోపించారు. జంతర్ మంతర్ వద్ద జరుగుతున్న నిరసనలు, దేశంలో తలెత్తిన పరిస్థితులు దేశ వ్యతిరేక శక్తులకు ప్రయోజనం చేకూర్చకూడదని స్పష్టం చేశారు. మన పిల్లల సమయం కోర్టు కేసులు, వివాదాల పాలు కాకూడదనే ఉద్దేశంతోనే తాను బాధ్యతల నుండి తప్పుకుంటూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి లేఖ రాసినట్లు వెల్లడించారు. తనకు మార్గదర్శనం చేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, మంత్రివర్గ సహచరులకు, అధికారులకు ధర్మేంద్ర ప్రధాన్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. దేశ సేవ తన జీవితంలో అత్యున్నత ప్రాధాన్యత అని ప్రకటించారు. భవిష్యత్తులో కూడా భగవాన్ జగన్నాథుని ఆశీస్సులతో భారతావని, ఒడిశా ప్రజలు, దేశ యువత ఆకాంక్షలు నెరవేర్చడానికి నిరంతరం శ్రమిస్తానని లేఖలో స్పష్టం చేశారు.

## 21 ఏళ్లకే ఎమ్మెల్యే.. ఎంపీగా పోటీ చేసే అవకాశం

ఆధారపడి ఉందని రేవంత్ రెడ్డి ఉద్ఘాటించారు. మాజీ ప్రధానులు రాజీవ్ గాంధీ, పీవీ నరసింహారావు తీసుకువచ్చిన రాజ్యాంగ సవరణల ద్వారా యువతకు ఓటు హక్కు, స్థానిక సంస్థల్లో పోటీ చేసే అవకాశం లభించిందని గుర్తుచేశారు. జర్మనీ, బ్రిటన్, సింగపూర్ వంటి దేశాల్లో యువత 18, 21 ఏళ్లకే అత్యున్నత పదవులు చేపడుతున్నారని ఆయన వివరించారు.

**మంత్రులుగా యువతే ఉండాలి**

దేశ జనాభాలో 30 శాతం ఉన్న జెన్‌జీ యువతకు చట్టసభల్లో కేవలం ఒక్క శాతం ప్రాతినిధ్యం మాత్రమే ఉండటం బాధాకరమన్నారు. విద్యా, ఐటీ శాఖలకు జెన్‌జీ మంత్రులే ఉంటే దేశం మరింత వేగంగా అభివృద్ధి చెందుతుందని రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. కేంద్ర విద్యా మంత్రిగా కూడా యువతకే అవకాశం దక్కేలా తాను అధిష్టానంతో మాట్లాడుతానని హామీ ఇచ్చారు. గుండె ధైర్యంతో కేంద్రంపై పోరాడిన యువతకు ఆయన అభినందనలు తెలిపారు.

## మేడ్చల్ జిల్లాలో ఘోర విషాదం..

దీక్షిత నేపథ్యం గురించి తెలిసిన వారంతా తీవ్రంగా చలించిపోతున్నారు. దీక్షిత ప్రస్తుతం బెంగళూరులోని ఒక ప్రముఖ కళాశాలలో పీజీ ఆప్తమాలజీ (కంటి వైద్య విభాగం) మొదటి సంవత్సరం చదువుతోంది. కంటి వైద్యురాలిగా స్థిరపడాలనే ఆశయంతో ఉన్నత చదువుల కోసం బెంగళూరు వెళ్లిన ఆమె, నాగారంలోని నివాసానికి వచ్చిన సమయంలో ఈ ఘాతుకానికి ఒడిగట్టింది. అయితే దీక్షిత ఆత్మహత్యకు గల ఖచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదని పోలీసులు తెలిపారు. చదువుల ఒత్తిడి వల్ల ఈ తీవ్ర నిర్ణయం తీసుకుందా? లేక ఏదైనా వ్యక్తిగత లేదా కుటుంబ సమస్యలు కారణమా? మానసిక ఆందోళనలు ఏమైనా ప్రభావం చూపాయా? అనే రకరకాల కోణాల్లో పోలీసులు విచారణ జరుపుతున్నారు. పోలీసులు ఆమె ఫోన్ వివరాలు, ల్యాప్‌టాప్‌ను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. అలాగే ఆమె బంధువులు, కుటుంబ సభ్యులను విచారించి ఆత్మహత్య వెనుక ఉన్న అసలు కారణాలను వెలికితీసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఎంతో భవిష్యత్తు ఉన్న వైద్య విద్యార్థిని ఇలా అర్థాంతరంగా ప్రాణాలు కోల్పోవడం ఆ కుటుంబంలో పూడ్చలేని లోటును మిగిల్చింది.

## పీఎం మోదీ డీప్‌ఫేక్ వీడియోల కలకలం

బ్యూరో (PIB) కీలక ప్రకటన చేసింది. ఈ వీడియోలు కృత్రిమ మేధస్సు (AI) సాయంతో రూపొందించిన డీప్‌ఫేక్ వీడియోలని, ప్రజలను తప్పుదోవ పట్టించడమే వాటి ఉద్దేశమని పీఐబీ ఫ్యాక్ట్ చెక్ విభాగం స్పష్టం చేసింది. పీఐబీ విడుదల చేసిన వివరాల ప్రకారం, వైరల్ అవుతున్న వీడియోల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ విద్యార్థుల నిరసనలపై చేసినట్లు చూపిస్తున్న వ్యాఖ్యలు పూర్తిగా కల్పితమైనవి. ఆ వీడియోల్లో కనిపిస్తున్న ఆడియోలను డిజిటల్‌గా మార్చి, అసత్య వ్యాఖ్యలను జోడించి ప్రచారం చేస్తున్నారని పేర్కొంది. ముఖ్యంగా ఈ వీడియోలను పాకిస్థాన్‌కు చెందిన ప్రచార సోషల్ మీడియా ఖాతాలు విస్తృతంగా షేర్ చేస్తున్నట్లు పీఐబీ వెల్లడించింది.
జాతీయ రాజధాని ఢిల్లీతో పాటు పలు రాష్ట్రాల్లో జరుగుతున్న భారీ విద్యార్థి నిరసనల నేపథ్యంలో, నిరసనకారులను తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ప్రధానమంత్రి, కేంద్ర మంత్రి హెచ్చరిస్తున్నట్లుగా ఈ నకిలీ వీడియోలను రూపొందించినట్లు అధికారులు గుర్తించారు. అయితే అలాంటి ప్రకటనలు ఎప్పుడూ చేయలేదని పీఐబీ స్పష్టం చేసింది. సోషల్ మీడియా వేదిక 'ఎక్స్' (X)లో చేసిన పోస్టులో, ఢిల్లీలో జరుగుతున్న నిరసనలకు సంబంధించి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదని పీఐబీ పేర్కొంది. అనుమానాస్పద ప్రభుత్వ సంబంధిత కంటెంట్ కనిపిస్తే వెంటనే తమ ఫ్యాక్ట్ చెక్ యూనిట్కు తెలియజేయాలని ప్రజలను కోరింది. ఇందుకోసం వాట్సాప్ నంబర్ +91 8799711259, ఇమెయిల్: factcheck@pib.gov.in ద్వారా ఫిర్యాదులు పంపవచ్చని తెలిపింది. అధికారుల ప్రకారం, అసలు వీడియోలను డిజిటల్‌గా మార్చి ఈ డీప్‌ఫేక్ వీడియోలు రూపొందించారు. ముఖ్యంగా గురువారం రాత్రి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నీట్ యూజీ పేపర్ లీక్ అంశంపై స్పందిస్తూ, పరీక్షల వ్యవస్థలో జరిగిన అవకతవకలపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రకటించిన ప్రసంగాన్ని వక్రీకరించి తప్పుడు వీడియోను సృష్టించారు. ఇదే విధంగా పార్లమెంట్ వెలుపల మీడియాతో మాట్లాడిన కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ వీడియోను కూడా డిజిటల్‌గా మార్పులు చేసినట్లు పీఐబీ తెలిపింది. ఇదే తరహాలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా లేదా తన పదవికి సంబంధించిన ప్రకటన చేసినట్లు ప్రచారంలోకి వచ్చిన మరో వీడియో కూడా పూర్తిగా నకిలీదేనని పీఐబీ తేల్చి చెప్పింది. ఆ వీడియోను డిజిటల్‌గా ఎడిట్ చేసి అసత్య సమాచారాన్ని ప్రచారం చేస్తున్నారని పేర్కొంటూ, ధర్మేంద్ర ప్రధాన్ అలాంటి వ్యాఖ్యలు ఎప్పుడూ చేయలేదని స్పష్టం చేసింది. 2019 నవంబర్‌లో ప్రారంభమైన పీఐబీ ఫ్యాక్ట్ చెక్ పోర్టల్ కేంద్ర ప్రభుత్వ విధానాలు, మంత్రిత్వ శాఖలు, ప్రభుత్వ విభాగాలకు సంబంధించిన తప్పుడు వార్తలు, పుకార్లు, దారి తప్పించే ప్రచారాన్ని గుర్తించి ప్రజలకు వాస్తవాలను తెలియజేసే ప్రత్యేక విభాగంగా పనిచేస్తోంది. ఇదిలా ఉండగా, నీట్ యూజీ 2026 పేపర్ లీక్ వివాదం నేపథ్యంలో దేశంలోని పలు ప్రాంతాల్లో, ముఖ్యంగా ఢిల్లీలో విద్యార్థుల ఆందోళనలు కొనసాగుతున్నాయి. కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ నిరసనల్లో విద్యా వ్యవస్థలో సమగ్ర సంస్కరణలు చేపట్టాలని, అలాగే కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని నిరసనకారులు డిమాండ్ చేస్తున్నారు. ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకుని సోషల్ మీడియాలో డీప్‌ఫేక్ వీడియోలు వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో, ప్రజలు సమాచారం నిజానిజాలు నిర్ధారించుకుని మాత్రమే నమ్మాలని పీఐబీ మరోసారి సూచించింది.

## ప్రతి వ్యక్తికి 7 కిలోల బియ్యం

- రేషన్ విధానంలో కేంద్రం సవరణలు

జయభేరి, హైదరాబాద్ :

కేంద్ర ప్రభుత్వం రేషన్ సరుకుల విధానంలో కీలక మార్పులు చేస్తోంది. జాతీయ ఆహార భద్రత చట్టం2013 ప్రకారం,అంత్యోదయ అన్న యోజన, ఏఏవై లబ్ధిదారులకు కుటుంబ సభ్యుల సంఖ్యతో సంబంధం లేకుండా నెలకు 35 కిలోల అందించే విధానాన్ని మార్చి, ప్రతి వ్యక్తికి నెలకు 7 కిలోల చొప్పున ధాన్యం అందించాలని యోచిస్తోంది.అయితే,ఏ కుటుంబానికైనా గరిష్ట పరిమితి 35 కిలోలుగానే కొనసాగుతుంది.ఈ మార్పుల ద్వారా పెద్ద కుటుంబాలకు న్యాయం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ సవరణలను ప్రతిపాదించింది.

# విద్యావ్యవస్థలో సంస్కరణలు అవసరం

"ఒక దేశ నాశనానికి అణుబాంబులు కానీ, సుదూర క్షిపణులు కానీ అవసరం లేదు. విద్యా వ్యవస్థ ప్రమాణాలను తగ్గించి, విద్యార్థులను పరీక్షల్లో మోసం చేయడానికి అనుమతిస్తే చాలు.. ఆ దేశం తనంతట తానే కూలిపోతుంది."దక్షిణాఫ్రికాలోని ఒక ప్రముఖ విశ్వవిద్యాలయ ప్రవేశ ద్వారం వద్ద పెద్ద అక్షరాలతో ఈ సత్యం రాసి ఉంటారు. సరిగ్గా ఈ కొటేషన్ మన దేశంలో నేడు చోటుచేసుకుంటున్న పరంపరలకు అద్దం పడుతోంది. దొరికినవాడే దొంగ.. దొరకనంత వరకు అందరూ దొరలే అన్నట్లుగా తయారైంది మన దేశంలోని పోటీ పరీక్షల తీరు. నీట్ ప్రవేశ పరీక్ష పేపర్ లీకేజీ ఉదంతం దేశ వ్యాప్తంగా లక్షల మంది విద్యార్థులలో, వారి తల్లిదండ్రులలో సృష్టించిన ఆగ్రహజ్వాలలు ఇంకా చల్లారలేదు. ప్రశ్నాపత్రం లీక్ అయిందని ఆధారాలతో సహా రుజువు కావడంతో దిద్దుబాటు చర్యల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం పరీక్షను రద్దు చేసి, తీవ్ర నిరసనల మధ్య మళ్లీ నిర్వహించింది. అంతవరకు బాగానే ఉంది. కానీ, ఇక్కడ అసలైన ప్రశ్న ఏమిటంటే ఈసారి దొరికింది కాబట్టి లీకేజీ బయటపడింది; మరి దొరకకుండా వెనుక తలకాయలు నడిపిన ముఠాలు, గతంలో జరిగిన పరీక్షల్లో ఎంతటి అక్రమాలకు పాల్పడి ఉంటాయి? భవిష్యత్తులో ఇవి మళ్లీ జరగవని గ్యారెంటీ ఏమిటి?మన విద్యా వ్యవస్థలో పేపర్ లీకేజీలు అనేవి ఒక సాధారణ రుగ్మత గా మారిపోవడం సమగ్ర ప్రజాస్వామ్యానికే పెను ప్రమాద ఘంటిక. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన అత్యున్నత వైద్య విద్యా ప్రవేశ పరీక్ష నీట్ లో చోటు చేసుకున్న అవకతవకలు బయటపడటంతో కేంద్ర ప్రభుత్వం తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొంటోంది. కేసు విచారణను సిబిఐ కి అప్పగించడం, దర్యాప్తు సంస్థలు బీహార్, గుజరాత్ సహా పలు రాష్ట్రాల్లో నిందితులను అరెస్ట్ చేయడం, ముఠాల గుట్టు రట్టు చేయడం చరచరా జరిగాయి. హైటెక్ పద్ధతుల్లో వాట్సాప్ గ్రూపులు, సేఫ్ హౌస్‌లలో విద్యార్థులకు సమాధానాలు బట్టీ పట్టించడం వంటి ఘోరాలు వెలుగు చూశాయి. దేశంలో యువతరం రోడ్లపైకి వచ్చింది. లీకేజీల వ్యవస్థపై అసహనం శృతిమించి కాక్రోచ్ పేరుతో సరికొత్త నిరసన ఉద్యమాలు రూపుదిద్దుకున్నాయి. లీకేజీలు, వ్యవస్థాగత లోపాల వల్ల తమ భవిష్యత్తు చీకటిమయమవుతోందన్న ఆవేదన, ఆగ్రహం యువతలో ఏ స్థాయిలో ఉందో ఈ నిరసనల ఉద్ధృతి స్పష్టం చేస్తోంది.మన దేశ పారదర్శకతకు పేపర్ లీకేజీలు కొత్తేమీ కావు. దశాబ్దాల చరిత్రను తిరగేస్తే, ప్రతిష్టాత్మక కేంద్ర, రాష్ట్ర స్థాయి పరీక్షల్లో ఎన్నో సార్లు లీకేజీ ఘటనలు వెలుగు చూశాయి. బయటపడి, రగడ తీవ్రమైనప్పుడు మాత్రమే ప్రభుత్వాలు రద్దు నిర్ణయాలు తీసుకున్నాయి. సమాజం దృష్టికి రాని, ఆధారాలు దొరకని ఎన్నో సందర్భాల్లో అక్రమార్కులు అత్యున్నత ర్యాంకులు పొంది



వ్యవస్థలోకి ప్రవేశించి ఉంటారనడంలో ఎలాంటి సందేహమూ లేదు. దీనివల్ల రాత్రింబవళ్లు కష్టపడి చదివిన నిజమైన ప్రతిభావంతులు, నిరుపేద విద్యార్థులు శాశ్వతంగా తమ అవకాశాలను కోల్పోయారు.
గతంలో జరిగిన నష్టాన్ని ఇప్పుడు పునరుద్ధరించలేకపోవచ్చు, కానీ భవిష్యత్తు తరాల భవితవ్యాన్ని రక్షించడానికి శాశ్వత, కఠిన కట్టడి చర్యలు వంద శాతం అవసరం. ఎప్పటికప్పుడు తాత్కాలిక ఉపశమనాలు లేదా చిన్నచిన్న కమిటీలతో సరిపెడుతున్న పాలకులు, ఈ వ్యవస్థాగత చీడను తుడిచిపెట్టే శాశ్వత పరిష్కారాల వైపు అడుగులు వేయకపోవడమే అసలు విషాదం. పేపర్ లీకేజీల మహమ్మారి కేంద్ర పరిధిలోని పరీక్షలకే పరిమితం కాలేదు. తెలుగు రాష్ట్రాల్లో వైఫల్యాలు అనేకమంది అభ్యర్థుల జీవితాలను బుగ్గిపాలు చేశాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలం నుంచి ఎంసెట్ లీకేజీలు పదే పదే కలకలం రేపాయి. ముఖ్యంగా 2016 లో తెలంగాణలో జరిగిన ఎంసెట్2 మెడికల్ పేపర్ లీకేజీ ఘటన దేశాన్నే దిగ్భ్రాంతికి గురిచేసింది. ఆల్ ఇండియా స్థాయిలో నెట్‌వర్క్ నడిపి, కోట్ల రూపాయలు వసూలు చేసి ప్రింటింగ్ ప్రెస్ స్థాయి నుంచే పేపర్ లీక్ చేశారు. దీంతో లక్షలాది మంది విద్యార్థులు మళ్లీ పరీక్ష రాయాల్సి వచ్చింది. హైదరాబాద్ కేంద్రంగా రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యాలయంలోనే కంప్యూటర్లు హ్యాక్ చేసి, అంతర్గత సిబ్బంది ద్వారా గ్రూప్1 ప్రిలిమ్స్, అసిస్టెంట్ ఇంజనీర్ పరీక్షల పేపర్లు లీక్ కావడం అత్యంత భయంకరమైన ఉదంతం. ఏళ్ల తరబడి కోచింగ్ సెంటర్లలో మగ్గిపోయిన నిరుద్యోగ యువత రోడ్లెక్కి ఉద్యమించాల్సి వచ్చింది. ఈ లీకేజీల ఫలితంగా పదే పదే పరీక్షలను రద్దు చేసి మళ్లీ నిర్వహించాల్సిన దుస్థితి ఏర్పడింది. తరచూ టెన్త్ క్లాస్ బోర్డు పరీక్షల ప్రశ్నాపత్రాలు పరీక్ష ప్రారంభమైన కొద్ది నిమిషాల్లోనే వాట్సాప్ గ్రూపుల్లో ప్రత్యక్షం కావడం, ఉపాధ్యాయులు, కార్పొరేట్ విద్యాసంస్థల ప్రతినిధులు అరెస్ట్ కావడం మనం చూస్తూనే ఉన్నాం. మరోవైపు, ఒకే దేశం - ఒకే పరీక్ష అనే అతిగా కేంద్రీకృతమైన నినాదం కూడా తీవ్రమైన సమస్యలను తెచ్చిపెడుతోంది. భారత్ లాంటి విభిన్నమైన, విశాలమైన దేశంలో కోట్లాది మందికి ఒకే ఏజెన్సీ ద్వారా ప్రవేశ పరీక్షలను నిర్వహించాలనుకోవడం పరిపాలనాపరంగా అత్యంత ప్రమాదకరమైన ప్రయోగం. దేశంలో ఎక్కడో ఒక మూలన ఉన్న పరీక్షా కేంద్రంలో చిన్న లోపం జరిగినా, లేదా ఒక డిజిటల్ నెట్‌వర్క్ హ్యాక్ అయి పేపర్ బయటకు వచ్చినా.. దేశవ్యాప్తంగా ఉన్న 20 నుండి 25 లక్షల మంది విద్యార్థుల శ్రమ బూడిదలో పోసిన పన్నీరవుతుంది. అంతేకాకుండా, రాష్ట్రాల విద్యా బోర్డుల స్వయంప్రతిపత్తి దెబ్బతిని, ప్రాంతీయ వ్యత్యాసాలు ఉన్న విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతోంది. ప్రజాస్వామ్యంలో నిరసన అనేది రాజ్యాంగం కల్పించిన హక్కు. అది ప్రభుత్వాల కళ్లు తెరిపించడానికి, వ్యవస్థాగత సంస్కరణలు సాధించడానికి ఉపయోగపడాలి. కానీ, ఆ నిరసనలు ప్రజా ఆస్తుల విధ్వంసానికి, హింసకు దారితీస్తే అది అరాచకత్వానికి దారితీసి, అసలు ఆశయానికే విఘాతం కలిగిస్తుంది.ప్రస్తుతం యువత జరుపుతున్న కాక్రోచ్ ఆందోళనలను , నీట్ నిరసనలను ప్రతిపక్షాలు ప్రత్యేకించి కాంగ్రెస్ వంటి పార్టీలు పూర్తిగా తమ రాజకీయ లబ్ధి కోసం హైజాక్ చేయడానికి ప్రయత్నిస్తున్నాయనే విమర్శలు ఉన్నాయి.
ఇది ఉద్యమ స్వభావాన్ని రాజకీయం గా మార్చేస్తోంది. గతంలో కాంగ్రెస్ సుదీర్ఘ పాలన కాలంలో ఏ రకమైన అవినీతి, వ్యూహాత్మక లోపాలు, ప్రశ్నాపత్రాల కుంభకోణాలు జరిగాయో దేశంలో మధ్య వయస్సులో ఉన్న ప్రతి పౌరుడికీ స్పష్టంగా తెలుసు. నాటి యూపీఏ హయాంలో వెలుగుచూసిన దారుణాలు దేశం ఇంకా మరచిపోలేదు. హింసకు, రాజకీయ హైజాకింగ్‌లకు తావివ్వకుండా, ప్రజాస్వామ్య గీత దాటకుండా సాగే వైజ్ఞానిక, చట్టబద్ధమైన పోరాటాలే ఎంతటి మొండి ప్రభుత్వాల మెడలనైనా వంచుతాయి. సమగ్రమైన, శాశ్వతమైన విద్యా సంస్కరణలకు తిరుగులేని బాటలు వేస్తాయి. రాజకీయనాయకుల స్వార్థానికి, అవినీతి ముఠాల అక్రమార్జనకు లక్షలాది మంది ప్రతిభావంతులైన విద్యార్థుల కన్నీళ్లు, నిరుద్యోగుల నిరాశ బలికాకూడదంటే ప్రతి ప్రశ్నా ప్రజాస్వామ్య ఆయుధంగా మారాలి.ప్రశ్నించే గొంతుకలకు స్పష్టమైన కార్యాచరణ తోడైనప్పుడే పాలకులు దిగివస్తారు. రాజకీయాల రంగు పడకుండా, చట్టసభలు చుట్టుముట్టేలా యువత తెచ్చే ఈ మేధో సంచలనమే రాబోయే రోజుల్లో వ్యవస్థలకు అసలైన దిశానిర్దేశం చేస్తుంది. పారదర్శకతకు పట్టంకడుతూ, పేపర్ లీకేజీలు లేని స్వచ్ఛమైన సమర్థ భారత్ ను నిర్మించుకోవడమే మన విద్యా వ్యవస్థకు, కష్టపడే ప్రతిభావంతులైన యువతకు మన సమాజం అందించే అత్యున్నతమైన, అసలైన గౌరవం!

## ఇదే ప్రజాస్వామ్యం

నడుమ ధర్మేంద్ర ప్రధాన్ తన మంత్రి పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ నేపథ్యంలో ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై కేంద్ర మంత్రి బండి సంజయ్ స్పందించారు. ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. దేశానికే తమ మొదటి ప్రాధాన్యమని.. ఆ తర్వాతే పార్టీ ప్రయోజనాలని స్పష్టం చేశారు. ధర్మేంద్ర ప్రధాన్ విద్యార్థి ఉద్యమం నుంచి.. కేంద్ర ప్రభుత్వంలో కీలక బాధ్యతలు నిర్వహించడం వరకు ఎదిగారని.. దశాబ్దాల పాటు ప్రజా జీవితంలో గడిపారని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో, ప్రజాస్వామ్యం అంటే ప్రజల మాట వినడం, వారి గొంతుకను గౌరవించడం.. అవసరమైనప్పుడు బాధ్యత స్వీకరించే ధైర్యం కలిగి ఉండటమని బండి సంజయ్ స్పష్టం చేశారు. పదవులు తాత్కాలికమని.. ప్రజల విశ్వాసమే అత్యంత ప్రధానమని పేర్కొన్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి పదవి నుంచి ధర్మేంద్ర ప్రధాన్ తప్పుకోవడం, తమ పార్టీ విశ్వసించే విలువలను ప్రతిబింబిస్తోందని.. పదవి కంటే బాధ్యతకు, స్వప్రయోజనం కంటే దేశానికి ప్రాధాన్యమనే విధానాన్ని తెలియజేస్తోందన్నారు. ధర్మేంద్ర ప్రధాన్ అందించిన సుదీర్ఘ సేవలు, కృషికి ధన్యవాదాలు తెలియజేసిన బండి సంజయ్.. ఇదే బీజేపీ.. ఇదే ప్రజాస్వామ్యం.. ఎల్లప్పుడూ దేశమే ప్రథమం.. అంటూ ట్వీట్ చేశారు. మరోవైపు నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో.. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను ప్రధానమంత్రికి పంపించారు. అనంతరం 'ఎక్స్'లో సుదీర్ఘ పోస్టు పెట్టిన ధర్మేంద్ర ప్రధాన్.. యువత ఆకాంక్షలను గౌరవిస్తున్నట్లు తెలిపారు. పదిరోజులుగా జరుగుతున్న పరిణామాలు ఎంతగానో బాధించాయన్న ధర్మేంద్ర ప్రధాన్.. తాను వ్యక్తిగత భేషజాలకు పోవడం లేదన్నారు. నీట్ అక్రమాలు తెలిసిన వెంటనే సీబీఐ విచారణకు ఆదేశించామని.. మళ్లీ పరీక్ష నిర్వహించామన్నారు. దేశ విద్రోహ శక్తులకు ఎలాంటి అవకాశం ఇవ్వకూడదనే ఉద్దేశంతోనే రాజీనామా చేస్తున్నట్లు స్పష్టం చేశారు.

## రిటైర్మెంట్ వయసు 62కు పెంపు

కార్పొరేషన్లు, సొసైటీల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు ఈ ఉత్తర్వులు వర్తిస్తాయి. గత ప్రభుత్వం 2022లో ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయసును 60 ఏళ్ల నుంచి 62 ఏళ్లకు పెంచిన సంగతి తెలిసిందే. ప్రభుత్వ రంగ సంస్థలు, కార్పొరేషన్లు, సొసైటీల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు మాత్రం వర్తించలేదు. అప్పటినుంచి ఈ ఉద్యోగులు కూడా పదవీ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచాలని కోరుతున్నారు. కొంతమంది ఉద్యోగులు కోర్టును ఆశ్రయించారు.. దీంతో ఏపీ ప్రభుత్వం ఈ అంశంపై చర్చించింది. ఏపీ ప్రభుత్వ రంగ సంస్థలు, కార్పొరేషన్లు, సొసైటీల్లో పనిచేస్తున్న ఉద్యోగుల పదవీ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచితే ఖజానాపై ఆర్థిక భారం సహా ఇతర అంశాలపై చర్చించారు. అనంతరం ఉద్యోగుల పదవీ విరమణ వయసును 60 ఏళ్ల నుంచి 62 ఏళ్లకు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేశారు. 60 ఏళ్లకే పదవీ విరమణ చేసిన ఉద్యోగుల్ని తిరిగి విధుల్లోకి తీసుకుంటున్నారు.. వారిని 62 ఏళ్ల వరకు సర్వీసులో కొనసాగనున్నారు. కాకపోతే 60 ఏళ్ల తర్వాత పదవీవిరమణ చేసి.. ఆ తర్వాత మళ్లీ ఉద్యోగంలో చేరితే.. ఉద్యోగంలో లేని కాలానికి జీతభత్యాలు చెల్లించరు. వీరిని 62 ఏళ్ల వరకు రెగ్యులర్ ఉద్యోగులుగా పరిగణిస్తారు. ఇటీవల ఏపీ ఆర్కైవ్స్ విశ్రాంత డైరెక్టర్ వి.రంగరాజ్ 60 పదవీ విరమణ చేయగా.. 62 ఏళ్లకు రిటైర్మెంట్ వయసు పెంచడంతో.. జులై 2న ఆయన తిరిగి జాయినింగ్ రిపోర్ట్ ఇచ్చారు. ఆయన్ను మళ్లీ విధుల్లోకి తీసుకుంటూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పుడు తాజాగా శాప్ ఉద్యోగులకు కూడా పదవీ విరమణ వయసును 60 నుంచి 62 ఏళ్లకు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేశారు.

## ఎల్‌నీనో సవాల్‌ను సమర్థవంతమైన ప్రణాళికతో ఎదుర్కొందాం

- మంత్రి సీతక్క
- వచ్చే వంద రోజులకు సరిపడా తాగునీటి నిలువలు ఉన్నాయి
- స్థానిక నీటి వనరులను సద్వినియోగం చేసుకోవాలి
- జలసిరి కార్యక్రమం ద్వారా జల సంరక్షణ చర్యలు చేపట్టాలి

జయభేరి, హైదరాబాద్ :



దేశవ్యాప్తంగా ఎల్‌నీనో పరిస్థితుల ప్రభావం కనిపిస్తున్న నేపథ్యంలో తెలంగాణలో తాగునీటి సరఫరాపై ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మిషన్ భగీరథ అధికారులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క ఆదేశించారు. రాష్ట్రంలోని రిజర్వాయర్లలో నీటి నిల్వలపై ప్రతిరోజూ సమీక్ష నిర్వహిస్తూ, అవసరమైన ప్రత్యామ్నాయ చర్యలను ముందుగానే సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. సింగూరు, పాలేరు వంటి కొన్ని రిజర్వాయర్లలో నీటి నిల్వలు తగ్గినప్పటికీ, వచ్చే 100 రోజుల పాటు రాష్ట్రంలో ఎలాంటి తాగునీటి సమస్య రాకుండా సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసినట్లు అధికారులు వివరించగా, దానిని కచ్చితంగా అమలు చేయాలని మంత్రి ఆదేశించారు. మంత్రి సీతక్క అధ్యక్షతన సచివాలయంలో శనివారం నాడు మిషన్ భగీరథ తాగునీటి సరఫరాపై ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిషోర్, మిషన్ భగీరథ ఈఎన్‌సీ కృపాకర్ రెడ్డి, చీఫ్ ఇంజినీర్లు, సూపరింటెండింగ్ ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ, "2023లో కూడా ఇలాంటి పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొని రాష్ట్రంలో ఎక్కడా తాగునీటి ఇబ్బందులు రాకుండా చేశాం. ఈసారి కూడా అదే నిబద్ధతతో పనిచేయాలి" అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 23,455 ఆవాసాల్లో 90 శాతం గ్రామాలకు సాధారణ స్థాయిలో తాగునీటి సరఫరా కొనసాగుతుండటం సానుకూల పరిణామమని, మిగిలిన ప్రాంతాల్లోనూ సమస్యలు వెంటనే పరిష్కరించేలా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే 145 పట్టణ స్థానిక సంస్థల్లో 140 యూఎల్‌బీలకు పూర్తిస్థాయిలో నీటి సరఫరా కొనసాగుతుండటం, మిగిలిన మున్సిపాలిటీలో కూడా ప్రజలకు ఇబ్బందులు లేకుండా నీటి సరఫరా జరుగుతూ ఉండటం సంతృప్తికరమని పేర్కొన్నారు. మండలాల వారీగా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని, గ్రామాల్లో మహిళా సంఘాలు, సర్పంచులు, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శులతో వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసి నీటి సరఫరా సమయాలపై ప్రజలకు ముందస్తు సమాచారం అందించాలని ఆదేశించారు. పైప్‌లైన్ లీకేజీలు, మరమ్మతుల కారణంగా ఒకరోజైనా నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడే పరిస్థితి వస్తే ముందుగానే గ్రామస్తులకు సమాచారం ఇవ్వాలని, తద్వారా ప్రజలు అవసరమైన ఏర్పాట్లు చేసుకునే అవకాశం ఉంటుందని సూచించారు. గ్రామాల్లో ఉన్న బోర్‌వెల్లను పూర్తిస్థాయిలో మరమ్మతులు చేసి సిద్ధంగా ఉంచాలని, బోర్‌వెల్ల వద్ద రీఛార్జ్ పిట్స్, రైన్‌వాటర్ హార్వెస్టింగ్ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. స్థానిక నీటి వనరులను బలోపేతం చేస్తూ జలసిరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, ప్రతి నీటి బొట్టును సంరక్షించే దిశగా గ్రామస్థాయిలో అవగాహన పెంచాలని సూచించారు. 16వ ఆర్థిక సంఘం నిధులను తాగునీటి అవసరాలకు వినియోగించుకోవచ్చని, కేంద్ర మార్గదర్శకాల ప్రకారం తాగునీటికే తొలి ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. గ్రామాల్లో ఎక్కడైనా తాగునీటి సమస్య తలెత్తితే వెంటనే ఆర్థిక సంఘం నిధులతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. త్వరలో మండల వారీగా సర్పంచ్లతో ఏ ఈ లు సమావేశాలు నిర్వహించి.. తాగునీటి తాజా సరఫరాపై.. సర్పంచ్ల సంతకాలతో నివేదిక రూపొందించాలని ఆదేశించారు. మిషన్ భగీరథకు ఇంకా అనుసంధానం కాని ఆదివాసీ, గిరిజన గ్రామాలను ఏఈలు వారం రోజుల్లో సందర్శించి నివేదిక సమర్పించాలని, కొన్ని గ్రామాల్లో ప్రతికూల పరిస్థితులు ఉన్న నేపథ్యంలో వారం రోజుల్లో ప్రత్యామ్నాయ కార్యాచరణ సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రతి 15 రోజులకు ఒకసారి తాగునీటి సరఫరాపై సమీక్ష నిర్వహిస్తానని, నిర్లక్ష్యం లేదా అలసత్వం ప్రదర్శించిన అధికారులను ఉపేక్షించమని మంత్రి సీతక్క స్పష్టం చేశారు.

# అభివృద్ధికి రూ. 9.15 కోట్ల మంజూరు

- 50 పనులకు పరిపాలనా ఆమోదం..
- రోడ్లు, డ్రైనేజి, తాగునీరు, పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం..



**జయభేరి, మేడ్చల్, జూలై 25:**

మున్సిపాలిటీలు కార్పొరేషన్‌లో విలీనం అయిన అనంతరం మేడ్చల్ సర్కిల్ 60 పరిధిలో అభివృద్ధి పనులకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోంది. మేడ్చల్, పూడూర్‌కిష్టాపూర్, గుండ్లపోచంపల్లి వార్డుల్లో మౌలిక వసతుల మెరుగుదలకు మొత్తం 50 అభివృద్ధి పనులకు రూ.914.80 లక్షలు (రూ.9.148 కోట్లు) మంజూరు చేశారు. ఇందులో రహదారులు, డ్రైనేజీ, తాగునీటి సరఫరా, పాఠశాలల్లో మౌలిక వసతులు, బోర్‌వెల్ మరమ్మతులు, జంక్షన్ అభివృద్ధి, దేవాలయాల పరిసరాల అభివృద్ధి వంటి పనులు చేపట్టనున్నారు. మేడ్చల్ వార్డు297లో సీసీ రోడ్ల నిర్మాణం, బీటీ రోడ్ల నిర్వహణ, స్టార్మ్ వాటర్ డ్రైన్ల మరమ్మతులు, నీటి సరఫరా పైప్‌లైన్‌ల మరమ్మతులు, బోర్‌వెల్ మోటార్ల పునరుద్ధరణ, ఓపెన్ నాలాలకు చైన్‌లింక్ మెష్ ఏర్పాటు, మురుగునీటి పైప్‌లైన్‌ల మరమ్మతులు వంటి పనులు చేపట్టనున్నారు. అలాగే గిర్మాపూర్, హరిజనవాడ, రైల్వే కాలనీ, హౌసింగ్ బోర్డు కాలనీ, టీచర్స్ కాలనీ, వినాయక్ నగర్ తదితర ప్రాంతాల్లో కొత్త సీసీ రోడ్లు వేయనున్నారు. పూడూర్‌కిష్టాపూర్ వార్డులో రాఘవేంద్ర కాలనీ, ఉమానగర్, అత్వెల్లి ప్రాంతాల్లో అనేక అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణంతో పాటు స్టార్మ్ వాటర్ డ్రైన్ల డీసిల్టింగ్, నీటి పైప్‌లైన్ మరమ్మతులు, శివాజీ విగ్రహం జంక్షన్ అభివృద్ధి, మురుగునీటి పైప్‌లైన్‌ల మరమ్మతులు చేపట్టనున్నారు. గుండ్లపోచంపల్లి వార్డులో సీసీ రోడ్లు, రోడ్ల విస్తరణ, మైసమ్మగూడలో కొత్త రోడ్లు, స్టార్మ్ వాటర్ డ్రైనేజి డీసిల్టింగ్, అపారెల్ పార్క్ రోడ్డులో మురుగునీటి డ్రైన్ నిర్మాణం, బోర్‌వెల్ మోటార్ల మరమ్మతులు చేపట్టనున్నారు. అదేవిధంగా ఎంపీపీఎస్ లక్ష్మీనగర్, ఎంపీపీఎస్ గుండ్లపోచంపల్లి, జెడ్పీహెచ్ఎస్ గుండ్లపోచంపల్లి పాఠశాలల్లో టాయిలెట్ బ్లాకుల నిర్మాణానికి కూడా నిధులు కేటాయించారు. అధికారుల వివరాల ప్రకారం ఇప్పటికే 13 పనులు పూర్తి కాగా, 15 పనులు పురోగతిలో ఉన్నాయి. మరో 15 పనులు ప్రారంభానికి సిద్ధంగా ఉండగా, 7 పనులు టెండర్ ప్రక్రియలో ఉన్నాయి. అన్ని పనులు పూర్తయితే మేడ్చల్ సర్కిల్ పరిధిలో రహదారులు, డ్రైనేజీ, తాగునీటి సరఫరా, విద్యాసంస్థల్లో మౌలిక వసతులు గణనీయంగా మెరుగుపడే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు.



## నాణ్యతతో పనులు పూర్తి చేయడమే లక్ష్యం
### డిప్యూటీ కమిషనర్ సూదంష్

నాణ్యతతో పనులు పూర్తి చేయడమే లక్ష్యమని మేడ్చల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సూదంష్ తెలిపారు. మేడ్చల్ సర్కిల్ పరిధిలో కార్పొరేషన్‌లో విలీనమైన తర్వాత మంజూరైన అభివృద్ధి పనులను దశలవారీగా అమలు చేస్తున్నామని కమిషనర్ సూదంష్ పేర్కొన్నారు. ఇప్పటికే పలువురు ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ, నిర్వహణ పనులు పూర్తయ్యాయని, మరికొన్ని పనులు పురోగతిలో ఉండగా మిగిలిన పనులు టెండర్ ప్రక్రియ లేదా ప్రారంభ దశలో ఉన్నాయని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా ప్రతి పనిని నాణ్యత ప్రమాణాలతో చేపడుతున్నామని తెలిపారు. పనుల అమలులో ఎలాంటి జాప్యం లేకుండా సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపడుతున్నారని చెప్పారు. ప్రజలకు అవసరమైన రహదారులు, డ్రైనేజీ, తాగునీటి సదుపాయాల కల్పనకు కార్పొరేషన్ ప్రాధాన్యత ఇస్తోందని, మంజూరైన అన్ని పనులను వీలైనంత త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని డిప్యూటీ కమిషనర్ సూదంష్ వివరించారు.



## పీవీ హైస్కూల్లో ఉచిత వైద్య శిబిరం

- లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ నార్త్ ఆధ్వర్యంలో నిర్వహణ..
- మల్లారెడ్డి హాస్పిటల్స్ సహకారంతో ఉచితంగా మందుల పంపిణీ..

**జయభేరి, మేడ్చల్ :**

ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ నార్త్ ఆధ్వర్యంలో, మల్లారెడ్డి హాస్పిటల్స్ సహకారంతో మేడ్చల్‌లోని పీవీ హైస్కూల్ ప్రాంగణంలో శనివారం ఉచిత ఆరోగ్య పరీక్షల శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో నిపుణులైన వైద్యులు రక్తపోటు, మధుమేహం, సాధారణ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, ఆరోగ్య సమస్యలపై ప్రజలకు అవసరమైన సూచనలు అందించారు. పరీక్షల అనంతరం అవసరమైన రోగులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పీవీ హైస్కూల్ డైరెక్టర్ రామేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ సమాజ సేవలో భాగంగా ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఈ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు తెలిపారు. పట్టణ ప్రాంతాల్లోని పేద, మధ్యతరగతి ప్రజలకు ఇలాంటి ఆరోగ్య శిబిరాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. ప్రజలు తమ ఆరోగ్యంపై నిరంతరం శ్రద్ధ వహించి, చిన్నచిన్న ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమానికి సహకరించిన లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ నార్త్, మల్లారెడ్డి హాస్పిటల్స్ వైద్య బృందానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగించి మరింత మందికి ప్రయోజనం చేకూర్చేందుకు కృషి చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పీవీ హైస్కూల్ డైరెక్టర్లు రామేశ్వర్ రెడ్డి, నర్సింలు గౌడ్, ఆంజనేయులు, లయన్ రవికుమార్, బాషా తదితరులు పాల్గొన్నారు.

## బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రాగం అర్జున్‌కు ఎంపీ ఈటల రాజేందర్ సన్మానం



**జయభేరి, మేడ్చల్, జూలై 25:**

భారతీయ జనతా యువ మోర్చా (బీజేవైఎం) మేడ్చల్ జిల్లా నూతన అధ్యక్షుడిగా నియమితులైన రాగం అర్జున్‌ను మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్ తన నివాసంలో శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు అభినందనలు తెలియజేసి, నూతన బాధ్యతల్లో విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ యువతలో సేవాభావాన్ని పెంపొందిస్తూ, భారతీయ జనతా పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో రాగం అర్జున్ సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. మేడ్చల్ జిల్లాలో యువతను సమన్వయం చేస్తూ పార్టీని మరింత బలోపేతం చేయడంలో ఆయన కీలక పాత్ర పోషిస్తారనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. రాగం అర్జున్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన పార్టీ జాతీయ, రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈటల రాజేందర్ మార్గదర్శకత్వంలో పార్టీ సిద్ధాంతాల ప్రచారం, యువత సమస్యల పరిష్కారం, ప్రజా సేవే లక్ష్యంగా నిరంతరం పనిచేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు బుద్ధి శ్రీను, మాజీ జిల్లా అధ్యక్షుడు పట్లోళ్ల విక్రమ్ రెడ్డి, బీజేపీ, బీజేవైఎం జిల్లా, మండల, శక్తికేంద్ర, బూత్ స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొని రాగం అర్జున్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.



## బాలాంజనేయ స్వామి.. దీవించవా..!

**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని వన్ టౌన్ సమీపంలోనున్న రాంనగర్ లో కొలువుదీరిన బాలాంజనేయ స్వామి వారికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని పురోహితుడు రాజమూరి హన్మేష్‌చారి ఆధ్వర్యంలో ఈ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి మూల విగ్రహాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. దీంతో స్వామివారు అలంకరణలో భక్తకోటికి దర్శనం ఇచ్చారు.ఈ సందర్భంగా స్వామివారికి విశేష దినోత్సవం పురస్కరించుకొని ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు తదితర పూజలు సాంప్రదాయ రీతిలో నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన భక్తులు స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి తరించారు.

## భూభారతి సర్వేపై రైతులకు అవగాహన

- రైలాపూర్ గ్రామంలో తహశీల్దార్ భూపాల్, సర్వే అధికారుల సమావేశం



**జయభేరి, మేడ్చల్, జూలై 25:**

భూభారతి కార్యక్రమంలో భాగంగా మేడ్చల్ మండలంలోని రైలాపూర్ గ్రామంలో శనివారం మేడ్చల్ తహశీల్దార్ భూపాల్‌తో పాటు సర్వే అధికారులు రైతులతో అవగాహన సమావేశం నిర్వహించారు. భూ సర్వే ప్రక్రియ, సర్వే నిర్వహణ విధానం, భూ రికార్డుల ప్రాధాన్యత, రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులు వివరించారు. సర్వే సమయంలో రైతులు సంబంధిత భూ పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని, అధికారులు సూచించిన విధంగా సహకరించాలని కోరారు. భూ సరిహద్దుల నిర్ధారణ, రికార్డుల నవీకరణలో భూభారతి సర్వే కీలక పాత్ర పోషిస్తుందని అధికారులు తెలిపారు. రైతులు సర్వేపై ఉన్న సందేహాలను నివృత్తి చేసుకుంటూ అధికారులను పలు ప్రశ్నలు అడిగారు. ఈ సందర్భంగా మేడ్చల్ మండల తహశీల్దార్ భూపాల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన భూభారతి సర్వే కార్యక్రమం భూ రికార్డులను పారదర్శకంగా, ఖచ్చితంగా రూపొందించేందుకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. రైతులు సర్వే సమయంలో తమ వద్ద ఉన్న పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ కార్డు, ఇతర భూ సంబంధిత పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. సర్వే నిర్వహించే అధికారులకు రైతులు పూర్తి సహకారం అందించాలని, భూ సరిహద్దులకు సంబంధించిన ఏవైనా సందేహాలు లేదా అభ్యంతరాలు ఉంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. భూ భారతి సర్వే ద్వారా భూ వివాదాలు తగ్గడంతో పాటు రికార్డుల నిర్వహణ మరింత పారదర్శకంగా మారుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని, ప్రతి ఒక్కరూ సర్వే ప్రక్రియలో భాగస్వాములు కావాలని తహశీల్దార్ భూపాల్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైలాపూర్ గ్రామానికి చెందిన రైతులు, సొసైటీ డైరెక్టర్ వెంకట్ రామ్ రెడ్డి, మాజీ సర్పంచ్ సురేందర్ రెడ్డి, గోపాల్ రెడ్డి, మాజీ సొసైటీ చైర్మన్ అంతిరెడ్డి రెడ్డి, రఘుపతి రెడ్డి, పెంటారెడ్డి, భూపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రైతుల అభ్యున్నతి కోసం వీరారెడ్డి చేసిన కృషి అభినందనీయం

- మాజీ డిసిసిబి జిల్లా అధ్యక్షుడికి చందు గౌడ్ నివాళి




**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దివంగత డిసిసిబి చైర్మన్ కే. వీరారెడ్డికి శనివారం దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని దేవరకద్ర మండలం కోయిల్ సాగర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నేత చందు గౌడ్ ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గత మాజీ డిసిసిబి చైర్మన్ జయంతి సందర్భంగా ఆయన సమాధి వద్దకు వెళ్లి పూలమాలలు వేసి చందు గౌడ్ నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా చందు గౌడ్ మాట్లాడుతూ దివంగత డిసిసిబి చైర్మన్ వీరారెడ్డి ఆశయాలే మాకు స్ఫూర్తి, వారి సేవలే మాకు మార్గదర్శనం అని ఆయన అన్నారు. సేవే ఆయన జీవితం, ప్రజలే ఆయన బలం, ప్రజా సంక్షేమం, రైతు అభ్యున్నతి కోసం వీరారెడ్డి చేసిన కృషి అభినందనీయమని చందు గౌడ్ అన్నారు.

## భక్తజన సందోహంతో పులకించిన "మన్యం కొండలు"

- ఘనంగా దేవస్థానంలో తొలి ఏకాదశి వేడుకలు
- వేలాదిగా తరలివచ్చిన భక్తులు
- దేవస్థానం చైర్మన్ మధుసూదన్ కుమార్ ఆధ్వర్యంలో సాంప్రదాయ రీతిలో పూజలు
- అలంకరణలో భక్తకోటికి స్వామి వారి దర్శనం




**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లాలోని ప్రధాన దేవాలయమైన మన్యం కొండ శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి దేవస్థానం శనివారం జనసంద్రమైంది. తొలి ఏకాదశి పర్వదిన వేడుకల సందర్భంగా జిల్లా నలుమూలల నుండి భక్తులు వేల సంఖ్యలో స్వామి దర్శనానికి తరలివచ్చారు. ప్రతి ఏడాది మన్యం కొండలో తొలి ఏకాదశి పర్వదిన వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహిస్తారు. అందులో భాగంగానే ఈ ఏడాది కూడా అనాదిగా వస్తున్న ఆచారం ప్రకారం సాంప్రదాయ రీతిలో ఈ పర్వదిన వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుండి తరలి వచ్చిన భక్తులు ఉదయం 7 గంటల నుండే దేవస్థానం ముందున్న కోనేరులో పుణ్య స్నానాలు ఆచరించి స్వామి దర్శనానికి బారులు తీరారు. భక్తి శ్రద్ధలతో స్వామివారిని దర్శించుకున్నారు. దేవస్థానం చైర్మన్, వంశపారంపర్య ధర్మకర్త అళహరి మధుసూదన్ కుమార్, అళహరి రామకృష్ణల ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు తదితర పూజలు నిర్వహించారు. విశేష దినోత్సవం సందర్భంగా స్వామివారిని సర్వాంగ సుందరంగా అలంకరించారు.

దీంతో స్వామివారు అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అలంకరణలో స్వామివారిని భక్తులు చూసి తన్మయం చెందారు.



ఒకసారి గా భక్తులు తరలి రావడంతో మన్యం కొండలు భక్తజన సందోహంతో పులకించిపోయాయి. కొన్ని వేల మంది భక్తులు విశేషాలు దినోత్సవ సందర్భంగా మన్యం కొండకు వచ్చి స్వామివారికి పూజలు నిర్వహించారు. ఎక్కడ చూసినా దేవస్థానం వద్ద భక్తులే కనిపించారు. విశేష దినోత్సవాన్ని పురస్కరించుకొని భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దేవస్థానం వద్ద అన్ని ఏర్పాట్లు చేశారు. స్వామి వారి పూజా కార్యక్రమాలలో ప్రధాన పూజారులు రాజేష్, నరసింహయ్య లతోపాటు దేవస్థానం ఈఓ శ్రీనివాసరాజు, దేవస్థానం పురోహితులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అన్ని వర్గాల అభ్యున్నతికి పాటుపడుతున్న ప్రభుత్వం

- దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి
- కొత్తకోటలో కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కుల పంపిణీ



**జయభేరి, దేవరకద్ర :**

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) అన్నారు. దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని కొత్తకోట పట్టణంలోనున్న ఆర్ కే గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో శనివారం కొత్తకోట, మధనాపురం మండలాలకు చెందిన లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్, ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే జిఎంఆర్ అందజేశారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే జిఎంఆర్ ప్రసంగించారు. అన్ని వర్గాల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం పాటుపడుతుందన్నారు. వారి సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. నిరుపేదలను ఆదుకోవడానికి ప్రభుత్వం పలు పథకాలకు శ్రీకారం చుట్టిందన్నారు. ఆ పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే జిఎంఆర్ సూచించారు. నిరుపేదలను ఆదుకోవాలన్న ఉద్దేశంతోనే ఇందిరమ్మ ఇండ్ల పథకానికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. నిరుపేదలకు ఈ పథకం ఎంతగానో దోహదపడు తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజల ప్రతినిధులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.




## దివంగత జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే ఎర్ర సత్యం జయంతి వేడుకలు

**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో శనివారం దివంగత జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే ఎర్ర సత్యం 69వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే శేఖర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఎర్ర సత్యం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఎర్ర సత్యం అభిమానులు పెద్ద ఎత్తున నినాదాలు ఇచ్చారు .ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎర్ర సత్యం అభిమానులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## మరిడిమాంబకు ప్రత్యేక పూజలు

- మాడుగుల ఎమ్మెల్యే బండారు



**జయభేరి, పరవాడ:**

పరవాడ మండలం రావాడ పంచాయతీ జల్లెలపాలెం గ్రామంలో కొలువుతీరిన మరిడిమాంబ అమ్మవారిని శనివారం తొలి ఏకాదశి పర్వదినాన టిడిపి సీనియర్ నేత,మాజీ మంత్రి,మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి దర్శించుకున్నారు. దర్శనానికి విచ్చేసిన ఎమ్మెల్యే బండారు కు టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు వియ్యపు చిన్న ఘన స్వాగతం పలికారు. అనంతరం గర్భాలయంలో మరిడిమాంబ అమ్మవారికి ఎమ్మెల్యే బండారు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.ఈ సందర్భంగా తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా ఆ చల్లని తల్లి ఆశీస్సులు ఈ ప్రాంత ప్రజలందరిపై ఉండాలని ప్రజలందరికీ సుఖశాంతులను ఆయురారోగ్యాలను ప్రసాదించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు కోరుకున్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా టిఎన్టియుసి అధ్యక్షులు రొంగలి గోపాలకృష్ణ,మాజీ ఎంపీటీసీ సారిపల్లి జోగినాయుడు,లోకిరెడ్డి అభినాయుడు,వెన్నెల గిరి, బండారు శంకర్,స్థానిక నాయకులు,ఆలయ కమిటీ సభ్యులు,మహిళలు పాల్గొన్నారు.

## బాలికల ఉన్నత పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈఓ శేష సాయి శైలజ

- విద్యార్థుల తల్లిదండ్రుల ఫిర్యాదుతో చర్యలకు ఉపక్రమించిన జిల్లా విద్యాశాఖ



**జయభేరి, పరవాడ:**

అనకాపల్లి జిల్లా పరవాడ మండల కేంద్రంలో ఉన్న జిల్లా పరిషత్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన మెగా పేరెంట్స్ సమావేశంలో బాలికలు ఎదుర్కొంటున్న సమస్యలపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. శుక్రవారం జరిగిన మెగా పేరెంట్స్ సమావేశంలో విద్యార్థుల తల్లిదండ్రులు లేవనెత్తన సమస్యలపై వివిధ దినపత్రికల్లో కథనాలు రావడంతో జిల్లా విద్యాశాఖ చర్యలకు ఉపక్రమించింది. శనివారం మండల విద్యాశాఖ అధికారిని శేష సాయి శైలజ పాఠశాలలో పర్యటించారు. హెచ్ఎం కు పాఠశాల సిబ్బందికి జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాల మేరకు నోటీసు జారీ చేశారు. విద్యార్థులు తల్లిదండ్రులు లేపనెత్తిన సమస్యలపై వివరణ కోరారు. మధ్యాహ్న భోజన పథకం నిర్వహణపై అప్రమత్తంగా ఉండాలని పాఠశాల సిబ్బందిని హెచ్చరించారు. పాఠశాలలో ఉన్న సమస్యలపై తమ దృష్టికి ఎందుకు తీసుకు రాలేదని ప్రశ్నించారు. పాఠశాలలో బాలికలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరిస్తామని తెలిపారు. మధ్యాహ్న భోజన పథకం నిర్వహణపై ఎప్పటికప్పుడు సమీక్షించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

## వ్యవసాయ పొలంలో బోర్ మోటార్ల కరెంటు కేబుల్ దొంగతనాలు



**జయభేరి, సైదాపూర్ :**

సైదాపూర్ మండల కేంద్రంలోని దుద్దనపల్లి గ్రామంలోని వ్యవసాయ పొలంలోని బోర్ మోటార్ల కరెంటు కేబులు వైర్ల దొంగతనాలు జరుగుతున్నాయి. దొంగలు స్టార్టర్ డబ్బా నుంచి బోర్ మోటర్లు వరకు ఉండే విలువైన కాపర్ రాగి వైర్లను కత్తిరించి.. వాటిని అక్కడనే తగలబెట్టి లోపల రాగిని అమ్ముకుంటున్నారు. దొంగతనాల వల్ల రైతులు ఆర్థిక నష్టం వాటిల్లడంతో పాటు పంటలకు నీరు ఎండిపోయే పరిస్థితి వస్తుంది. వైర్లు దొంగతనాలు రైతులు నష్టాలు తీసుకోవలసిన జాగ్రత్తలు రాగి కాపర్ విలువ మార్కెట్లో రాగి కి మంచి ధర ఉండడంతో దొంగలు సులువుగా డబ్బులకు సంప్రదించడానికి పొలాల్లో బోర్ మోటార్ల వైర్లను టార్గెట్ చేస్తున్నారు. చాడ ఆది రెడ్డి, తాటిపల్లి మహేందర్ రెడ్డి, పైడిపల్లి తిరుపతి గౌడ్, వ్యవసాయ పొలంలోని బోర్ మోటార్ల కరెంటు కేబులు పేర్లు బాధితులు, పోలీసులకు 100 నెంబర్ కు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు అపరమాతమై ఫీల్డ్ మీదికి వచ్చి ఎంక్వయిరీ చేసుకోవడం జరిగింది.

# కురుమూర్తి దేవస్థానం అభివృద్ధికి కృషి

- దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్
- కురుమూర్తి దేవస్థానం వద్ద లక్ష పుష్పార్చన పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే

**జయభేరి, దేవరకద్ర :**

కురుమూర్తి దేవస్థానం అభివృద్ధి పై ప్రత్యేక దృష్టి పెట్టడం జరిగిందని,వచ్చే జూలై నాటికి మహబూబ్ నగర్ జిల్లాలోని చిన్నచింతకుంట మండలం శ్రీ కురుమూర్తి స్వామి దేవస్థానం వద్ద నిర్మించే ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ పనులను పూర్తి చేస్తామని దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) అన్నారు. కురుమూర్తి స్వామి దేవస్థానం వద్ద నిర్మిస్తున్న ఎలివేటెడ్ కారిడార్ తో కూడిన ఘాట్ రోడ్డు నిర్మాణ పనులను శనివారం ఆర్ అండ్ బి ఈఎన్సి బివి రావు, ఎస్ ఈ రాజేందర్ తదితర అధికారులతో కలిసి ఎమ్మెల్యే జిఎంఆర్ పరిశీలించారు. అనంతరం దేవస్థానం వద్ద తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని నిర్వహించిన లక్ష పుష్పార్చన పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. దేవస్థానానికి వచ్చిన ఎమ్మెల్యే జిఎంఆర్ కు ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు. అనంతరం స్వామివారిని ఎమ్మెల్యే జిఎంఆర్ దర్శించుకున్నారు.





పురహితులు ఎమ్మెల్యే జిఎంఆర్ పై అక్షింతలు చెల్లి ఆశీర్వచనం పలికారు. స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ కురుమూర్తి స్వామి ఆలయం అభివృద్ధి పై దృష్టి పెట్టి భక్తుల సౌకర్యార్థం వంతెన నిర్మాణం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని అడిగిన వెంటనే ఎలివేటెడ్ కారిడార్ తో కూడిన ఘాట్ రోడ్డు నిర్మాణం కోసం రూ.110 కోట్లు మంజూరు చేశారన్నారు. కారిడార్ నిర్మాణ పనులు వేగంగా కొనసాగు తున్నాయన్నారు. ఈ సందర్భంగా పనుల పురోగతిని పరిశీలించడం జరిగిందన్నారు. ఈ పనులను సాధ్యమైన త్వరగా పూర్తిచేయాలన్న కృత నిశ్చయంతో పనిచేస్తున్నామని అన్నారు. ఈ బ్రహ్మోత్సవాలనాటికీ దేవస్థానానికి వచ్చే వంతెన నిర్మాణ పనులు పూర్తవుతాయన్నారు. ఎలివేటెడ్ నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభిస్తామని ఎమ్మెల్యే జిఎంఆర్ అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## బ్రహ్మోస్ మిస్సైల్ కేంద్రం భూ సర్వే ప్రారంభం

- బ్రహ్మోస్ మిస్సైల్ కేంద్రం ఏర్పాటుకు వడివడిగా అడుగులు
- ఫలించిన దేవరకద్ర ఎమ్మెల్యే కృషి
- బ్రహ్మోస్ వస్తే.. భారీ ఉపాధి..
- అభివృద్ధిలో దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్ మార్క్



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర మండలంలో నిర్మించే బ్రహ్మోస్ మిస్సైల్ కేంద్రానికి సంబంధించి భూ సర్వే శనివారం ప్రారంభమైంది. రెవిన్యూ అధికారులు ఈ సర్వేను ప్రారంభించారు. ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) ప్రత్యేక కృషితో దేవరకద్ర నియోజకవర్గం లోని దేవరకద్ర మండలానికి బ్రహ్మోస్ మిస్సైల్ కేంద్రం మంజూరు అయింది. దేవరకద్ర మండలంలోని చౌదర్ పల్లి, బస్వాయపల్లి గ్రామాల మధ్య ఈ మిస్సైల్ కేంద్రం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ మిస్సైల్ కేంద్రం వస్తే ఇక్కడ యువతకు భారీ ఉపాధి లభించే అవకాశం ఉంది. బ్రహ్మోస్ మిస్సైల్ తయారీ యూనిట్ కు ఇదివరకే దాదాపు 400 ఎకరాల స్థల విషయంలో టీజీఐఐసి కేంద్ర రక్షణ శాఖ మంత్రి, ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి భేటీతో చర్చకు వచ్చింది. దేవరకద్ర మండలంలోని బస్వాయపల్లిచౌదర్ పల్లి గ్రామాల మధ్య 400 ఎకరాల ప్రభుత్వ భూమి ప్రస్తుతం అందుబాటులో ఉంది. దీనిని ఉచితంగా అప్పగించేందుకు ప్రభుత్వం సానుకూలత వ్యక్తం చేసింది. టిజిఐఐసి నుంచి కూడా ఈ మేరకు రక్షణ శాఖకు లేక కూడా రాయడం జరిగింది. గత ఏడాదే బ్రహ్మోస్ డి ఆర్ డి ఓ సంస్థలకు చెందిన ఉన్నతాధికారులు చౌదర్ పల్లి భూముల్లో పర్యటించడం జరిగింది. ఈ ప్రాంతం బ్రహ్మోస్ మిస్సైల్ కేంద్రం ఏర్పాటు కు అనుకూలమే అని సాంకేతాలు కూడా అప్పట్లో ఇచ్చారు. దీనివల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా 5 వేల మందికి ఈ మిస్సైల్ కేంద్రం ద్వారా ఉపాధి దక్కే అవకాశం ఉంది. అంతేకాకుండా అదనంగా ఇంకా స్థలం అవసరమైతే కూడా అందుబాటులో ఉందని అంటున్నారు. ఈ యూనిట్ ఏర్పాటుకు తగు చొరవ తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్ ఇదివరకే విజ్ఞప్తి చేయడం జరిగింది. దేవరకద్ర మండలానికి బ్రహ్మోస్



మిసైల్ కేంద్రం మంజూరు కావడంపై ఎమ్మెల్యే జీఎంఆర్ కు ప్రజల నుండి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయంలో ఆయన చేస్తున్న కృషిని పలువురు అభినందిస్తున్నారు. ఈ మిస్సైల్ కేంద్రం మంజూరు వెనుక ఎమ్మెల్యే జిఎంఆర్ కృషి చాలా ఉంది అంటున్నారు. ఈ విషయంలో ఎమ్మెల్యే జిఎంఆర్ కృషిఫలించినట్లయింది.

## విద్యార్థుల హాజరు తప్పక ఎఫ్ ఆర్ ఎస్ లో నమోదు చేయాలి

- దేవరకద్ర ఎంఈఓ బలరాం
- దేవరకద్రలో ముగిసిన ఉపాధ్యాయుల మొదటి విడత శిక్షణ

**జయభేరి, దేవరకద్ర :**




విద్యార్థుల హాజరు ను తప్పక ఎఫ్ ఆర్ ఎస్ లో నమోదు చేయాలని మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర మండల ఎంఈఓ బలరాం సూచించారు. దేవరకద్రలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న ప్రాథమిక, ప్రాథమికోన్నత, పాఠశాలలో బోధిస్తున్న ఉపాధ్యాయుల మొదటి విడుత శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది.

ఈ కార్యక్రమానికి ఎం ఈ ఓ బలరాం ముఖ్యఅతిథిగా హాజరై కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు. ఇంటిగ్రేటెడ్ ఇన్ సర్వీస్ టీచర్ ట్రైనింగ్ లో తెలుగు, ఇంగ్లీష్ మరియు మ్యాథమెటిక్స్ సబ్జెక్టు విషయాలపై ఆర్పీలు చెప్పినటువంటి విషయాలను ఉపాధ్యాయులు బాగా అవగాహన చేసుకుని తమ తమ పాఠశాలలో విద్యార్థు ల అభివృద్ధికై వినియోగించాలని సూచించారు.

తరగతి వారీగా, విషయాల వారీగా, విద్యార్థులలో సామర్థ్యాల సాధనకై కృషి చేయాలని సూచించారు.

అదేవిధంగా రెమిటేషన్ క్లాస్సెస్ అన్ని సబ్జెక్టులపై, 5వ తరగతిలో వెనుకబడిన విద్యార్థుల కోసం ఎస్సీఈఆర్టీ వారు రూపొందించిన రెమిడీయేషన్ మాడ్యూల్, మంత్లీ ఫోకస్ కాంపిటీఎన్సీ కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు చక్కగా తమ తమ పాఠశాలలో వినియోగించుకోవాలని కోరారు. అదేవిధంగా విద్యార్థుల హాజరు శాతం 70కంటే ఎక్కువగా ప్రతిరోజు ఉండాలన్నారు. ఈ మూడు రోజుల శిక్షణ కార్యక్రమంలో అందరూ ఉపాధ్యాయులు సమయపాలన పాటించినందుకో వారిని ఎంఈఓ అభినందించారు.

అదేవిధంగా రెండో విడత శిక్షణ కార్యక్రమం ఈనెల 27 నుండి 29 వరకు నిర్వహిస్తామన్నారు. ఈ మొదటి విడతలో శిక్షణ కార్యక్రమానికి దాదాపు 46 మంది ఉపాధ్యాయులు హాజరయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీహెచ్ఎస్ కోయిల్ సాగర్ స్కూల్ కాంప్లెక్స్ ప్రాధానోపాధ్యాయుడు కే.రమేష్ నాయక్, సబ్జెక్ట్ ఆర్పీలు కే.శంకర్, ఎం శ్రీనివాసరెడ్డి, పవన్ కుమార్, నాగరాజు మరియు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా ప్రభుత్వంలో పేదలకు పెద్ద పీఠ

- ప్రజా పాలనలో ప్రజలకు సంక్షేమ ఫలాలు
- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ

**జయభేరి, షాద్ నగర్, జులై 25 :**




షాద్‌నగర్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన 75 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల చెక్కులను షాద్‌నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి పంపిణీ చేశారు. ఫరూఖ్ నగర్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 29 మంది, షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని 46 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.75,83,700 విలువైన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.. పేదింటి ఆడబిడ్డల వివాహాలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు.

అర్హులైన ప్రతి కుటుంబానికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల ప్రయోజనం అందేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని, సంక్షేమ ఫలాలను అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి పారదర్శకంగా అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు.



## చౌరస్తా విస్తరణ చేయడం అభినందనీయం

- రోడ్డు మధ్యలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి
- మాల మహానాడు రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు వినోద్ కుమార్

**జయభేరి, షాద్ నగర్, జులై 25 :**

షాద్ నగర్ పట్టణ అభివృద్ధికి అన్ని వర్గాల ప్రజలు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని.. రోడ్డు మధ్యలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని మాల మహానాడు రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు వినోద్ కుమార్ కోరారు. ఎప్పుడైతే రోడ్ల వెడల్పు, రవాణా వ్యవస్థ బలోపేతం అవుతుందో ఆ ప్రాంతం ఆర్థికంగా అభివృద్ధి చెందినందుకు అవకాశాలు ఉంటాయనే విషయాన్ని గ్రహించాలని కోరారు. ముఖ్యంగా చౌరస్తా విస్తరణ అభివృద్ధి కోసం గత ప్రభుత్వంలోనే నిధులు మంజూరు చేసినప్పటికీ వివిధ కారణాల చేత రోడ్డు విస్తరణ పనులు చేపట్టలేదని తెలిపారు. చౌరస్తా విస్తరణ పనులు 100 అడుగుల మేర చేపడతామని చెప్పడం ఎంతో అభినందనీయమని.. అదే తరహాలో మరో 30 అడుగుల మేర పెంచి ఉదయం సమయంలో వాకర్స్ కోసం ప్రత్యేకంగా సోలార్ రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరారు. ఫుట్ పాత్‌పై సోలార్ విద్యుత్ వ్యవస్థను ఏర్పాటు చేయడం ద్వారా చిన్న పిల్లలు సైకిలింగ్ చేయడానికి మరియు వాకర్స్‌కు వాకింగ్ చేయడానికి అనుకూలంగా మార్చాలి. ప్రస్తుత షాద్‌నగర్ ఎమ్మెల్యేకి ఇది ఒక గొప్ప అవకాశమని, ఈ అభివృద్ధి పనుల ద్వారా మంచి గుర్తింపు లభిస్తుందని పేర్కొనడం. నేపథ్యంలో డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని రోడ్డు విస్తరణ చేపట్టిన అనంతరం సర్కిల్ (మధ్యన)ఏర్పాటు చేయాలని అభిప్రాయపడ్డారు. స్థానికుల, పట్టణ వ్యాపారుల అభిప్రాయాల మేరకు వీలైనంత ఎక్కువగా రోడ్డు విస్తరణ చేస్తే సౌలభ్యంగా ఉంటుందని సూచించారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుపై ప్రభుత్వంతోపాటు ప్రజాప్రతినిధులు ప్రత్యేక శ్రద్ధ చూపవలసిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు వచ్చినబ ఈ మంచి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రజలందరి మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. చౌరస్తా విస్తరణ జరిగితే రవాణా సౌకర్యానికి ఎంతో మేలు చేసినట్లు అవుతుందని. దాంతో పట్టణం మరింత అభివృద్ధి సాధించేందుకు అవకాశం ఉంటుందని వినోద్ కుమార్ పేర్కొన్నారు.

## విద్యార్థుల ఐక్య పోరాటానికి విజయం



**జయభేరి, దేవరకొండ :**

విద్యార్థుల న్యాయమైన హక్కుల సాధన కోసం దేశవ్యాప్తంగా సాగిన ఐక్య ఉద్యమం ప్రజాస్వామ్య చరిత్రలో ఒక ముఖ్యమైన విజయంగా నిలిచిందని బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వేముల రాజు పేర్కొన్నారు. విద్యార్థుల నిరంతర పోరాటం, ఐక్యత, ప్రజాస్వామ్య పద్ధతిలో సాగిన ఉద్యమం ఫలితంగానే కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సి వచ్చిందని ఆయన అన్నారు. విద్యార్థుల స్వరం ఎంత శక్తివంతమైనదో ఈ పరిణామం మరోసారి దేశానికి చాటిచెప్పిందన్నారు. విద్యా వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం, విద్యార్థుల ప్రయోజనాల పరిరక్షణ కోసం పోరాడిన ప్రతి విద్యార్థికి ఆయన అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో కూడా విద్యార్థుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంతో పరిష్కరించాలని, విద్యార్థుల భవిష్యత్తుతో రాజీ పడే విధానాలను పూర్తిగా విరమించుకోవాలని వేముల రాజు డిమాండ్ చేశారు.

# ఓటు హక్కు అనేది రాజ్యాంగం కల్పించిన శక్తి

- **100 శాతం SIR ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలి ఎమ్మెల్యే బాలు నాయక్**

**జయభేరి, చింతపల్లి :**



SIR ప్రక్రియపై చింతపల్లి మండలం, తీదేడు గ్రామంలో విస్తృత పర్యటన నిర్వహించిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్. ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (SIR) ప్రక్రియను విజయవంతం చేయాలనే లక్ష్యంతో దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ తీదేడు గ్రామంలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా తీదేడు గ్రామాల్లో బీఎల్ఏలు (BLAలు), బీఎల్ఓలు (BLOలు),కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించి SIR విధానంపై సమగ్ర అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలు నాయక్ మాట్లాడుతూ ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడికి ఉన్న అత్యంత విలువైన రాజ్యాంగబద్ధమైన హక్కు అని అన్నారు. అర్హత కలిగిన ఒక్క ఓటరు పేరు కూడా ఓటరు జాబితా నుంచి తొలగిపోకుండా బీఎల్ఓలు, బీఎల్ఏలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. SIR ప్రక్రియలో ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలించి, అవసరమైన పత్రాలను సకాలంలో సమర్పించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా ప్రతి బూత్‌లో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు ఓటు హక్కు ప్రాముఖ్యతను వివరిస్తూ, ఓటరు జాబితాలో పేరు ఉండటం అత్యంత అవసరమని ప్రతి అర్హత కలిగిన వ్యక్తి తన ఓటు హక్కును కాపాడుకోవాలని ఎమ్మెల్యే శ్రీ నేనవత్ బాలు నాయక్ గారు సూచించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియను నిర్లక్ష్యం చేయకుండా ప్రజలు స్వయంగా ముందుకు వచ్చి తమ వివరాలను సరిచూసుకోవాలని కోరారు. ప్రతి బూత్‌లో 100 శాతం SIR ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని బీఎల్ఏలు, బీఎల్ఓలు, కాంగ్రెస్ పార్టీ నాయకులకు ఎమ్మెల్యే బాలు నాయక్ సూచించారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి కార్యకర్త బాధ్యతాయుతంగా వ్యవహరించి అర్హులైన ప్రతి ఓటరి హక్కును కాపాడాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో చింతపల్లి తహశీల్దార్ విజయలక్ష్మి, RI సునీత,మాల్ మార్కెట్ డైరెక్టర్ దొంతం అలివేలు సంజీవ రెడ్డి, తీదేడు మాజీ సర్పంచ్ లు కాయితి జితేందర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దాసరి శ్రీనివాస్ యాదవ్, సర్పంచ్ ఉలుపాల స్వప్న,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు హరి నాయక్,అంగిరేకుల నాగభూషణం,కొండూరు పవన్ కుమార్,ముచ్చర్ల యాదగిరి, కసారపు శ్రీనివాస్,మాల్ మార్కెట్ డైరెక్టర్ రామవత్ హనుమ నాయక్, మాజీ ఉప సర్పంచ్ ధరణిపతి రమణా రావు, నల్లబెల్లి సదానందం, మెండే వెంకటయ్య, కొర్ర రాంసింగ్, SIR సూపర్వేసర్: రజిత, GPO యాదయ్య, పంచాయితీ కార్యదర్శి కిరణ్ కుమార్, BLO లు చింతకుంట్ల అంజమ్మ, గంటేల చంద్రయ్య,BLA లుగునమోని శ్రీనివాస్, రాశిక వెంకటేశ్వర్లు, చింతకుంట్ల రాకేష్, శివర్ల శంకర్ యాదవ్, మగ్రు మీనా రావు, కొరివి యాదగిరి, కల్లు శ్రీను, దాసరి మారయ్య, ఉడుత లింగయ్య, నెలపట్ల మురళి,దాసరి ముత్తయ్య,ఇడమోని శంకర్,గునమోని శ్రీను, గునమోని అంజయ్య, రామవత్ శ్రీను, రామవత్ హన్మంతు, మోత్య, బొడ్డు తిరుపతి, ఐతమోని వెంకటయ్య, గంటేల నరేష్, కాయితి శ్రీనివాస్ రెడ్డి, కాయితి కృష్ణా రెడ్డి, ఐతమోని మల్లయ్య, సాయి, పల్లెటి నర్సింహ, సందే వెంకటయ్య,సందే లక్ష్మయ్య,మెరిక లచ్చయ్య,శ్రీరాములు,కొండల్,శంకర్,శ్రీను, కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు, బీఎల్ఏలు, బీఎల్ఓలు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు గ్రామా ప్రజలు తదితరులు పాల్గొన్నారు.




## పట్టణ అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలి

- **ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి**
- **పరకాల పట్టణాన్ని పరిశుభ్రమైన పట్టణముగా తీర్చిదిద్దుతా**
- **చిరు వ్యాపారులు పరిశుభ్రతకు, అభివృద్ధికి సహకరించాలి**

**జయభేరి, పరకాల, జులై 25:**

శనివారం పరకాల పట్టణ కేంద్రంలోని కూరగాయల మార్కెట్ , చేపల మార్కెట్ ను అధికారులతో కలిసి పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి సందర్శించారు. అనంతరం మార్కెట్ పరిసర ప్రాంతాలను పర్యటించి, చిరు వ్యాపారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మార్కెట్ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మిగిలిపోయిన వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించారు. మార్కెట్ పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు, లైటింగ్ సిస్టంను ఏర్పాటు చేస్తామని అన్నారు. చేపల మార్కెట్ బయట ఉండడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, వీరికి నిర్దిష్టమైన ప్రదేశంలో చేపల మార్కెట్ ఏర్పాటు చేస్తామన్నారు. నిబంధనలు ఉల్లంఘించి రోడ్డుపై చెత్త వేస్తే పెనాల్టీ విధిస్తామని అన్నారు. చిరు వ్యాపారం చేసుకునే వారికి వారి యొక్క జీవనదారం కోల్పోకుండా ప్రత్యామ్నాయంగా నిర్దిష్టమైన ప్రదేశం కేటాయిస్తామని అన్నారు. అలాగే పరకాల పట్టణ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలి, ప్రజల సహకారంతోనే పరకాల పట్టణ అభివృద్ధి సాధ్యం అని గత పాలకుల వైఖరి వల్ల నిరాధారణకు గురైంది అన్నారు.



## విద్యార్థుల ఉద్యమానికి విజయం

- **చర్చలతో కేంద్ర ప్రభుత్వం సీజేపీ ఒప్పందం**
- **ప్రజాస్వామ్య విజయానికి నిదర్శనం**
- **మాజీ జెడ్పీటీసీ తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి**

**జయభేరి, షాద్ నగర్, జులై 25 :**

ప్రజా సమస్యలను ప్రారంభం నుంచే చర్చల ద్వారా పరిష్కరించి ఉంటే దేశవ్యాప్తంగా నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు, ఆందోళనలు నివారించేవని ఆమె అన్నారు. ప్రజల గొంతును అణిచివేయడం, నిరసనలను నిర్లక్ష్యం చేయడం కంటే సంభాషణ ద్వారా సమస్యలను పరిష్కరించడమే నిజమైన ప్రజాస్వామ్య స్ఫూర్తికి నిదర్శనమని కేశంపేట మాజీ జెడ్పీటీసీ తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆలస్యమైనా కేంద్ర ప్రభుత్వం చర్చలకు ముందుకు వచ్చి సీజేపీతో ఒప్పందానికి రావడం సానుకూల పరిణామమే అయినప్పటికీ, ఒప్పందంలో ఇచ్చిన ప్రతి హామీని చిత్తశుద్ధితో, నిర్దిష్ట కాలవ్యవధిలో అమలు చేయాల్సిన పూర్తి బాధ్యత కేంద్ర ప్రభుత్వంపైనే ఉందని ఆమె స్పష్టం చేశారు.దేశంలో ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలంటే ప్రజల గొంతును వినడం, చర్చలకు ప్రాధాన్యం ఇవ్వడం, రాజ్యాంగ స్ఫూర్తిని గౌరవించడం ప్రతి ప్రభుత్వ బాధ్యత అని ఆమె అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల హక్కులు, రాజ్యాంగ పరిరక్షణ, శాంతియుత ప్రజాస్వామ్య ఉద్యమాలకు అండగా నిలుస్తుందని తెలిపారు.కేంద్ర ప్రభుత్వం ఒప్పందంలో ఇచ్చిన హామీలను త్వరితగతిన అమలు చేసి ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలని తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి కోరారు.

## గిరి ప్రదక్షిణను ప్రారంభించిన పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల

**జయభేరి, పరవాడ:**



అనకాపల్లి జిల్లా పరవాడ మండలం,ఈ బోనంగి గ్రామంలో గల కలియుగ ఆరాధ్య దైవం భూ సమేత అభయ వెంకటేశ్వర స్వామి గిరి ప్రదక్షిణ కార్యక్రమంనీ పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గిరి ప్రదక్షిణ రథయాత్రను రమేష్ బాబు లాంచనంగా ప్రారంభించారు. ముందుగా భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి ప్రత్యేక పూజలు చేసి ఈ ప్రాంతమంతా సుభిక్షంగా ఉండాలని ప్రార్థనలు చేశారు. పలు కంపెనీలు వచ్చి యువతకు ఉపాధి లభించాలని, పాడిపంటలు వృద్ధి చెంది ప్రజలంతా సంతోషంగా ఉండాలని స్వామివారిని ప్రార్థించారు. అనంతరం రమేష్ బాబు మీడియాతో మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పది కాలాలపాటు కొనసాగాలని రాష్ట్రం అన్ని రంగాల అభివృద్ధి చెందాలని రాష్ట్ర ప్రజలందరూ సంతోషంగా ఉండాలని కలియుగ ఆరాధ్యదైవం శ్రీ వెంకటేశ్వర స్వామిని ప్రార్థించినట్లు తెలియజేశారు. ఈ బృహత్తర కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్న స్థానిక తెలుగుదేశం, జనసేన, బిజెపి నాయకులకు, ఆలయ కమిటీ సభ్యులకు అభినందనలు తెలియజేస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో సమర్థవంతమైన పాలన కారణంగా ప్రజలందరూ సంతోషంగా ఉన్నారని ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగాలని భగవంతుని ప్రార్థించినట్లు తెలియజేశారు.ఈ యొక్క కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బిగిడి రామ గోవింద్ , సీనియర్ నాయకులు పంచకర్ల ప్రసాద రావు,మాజీ జడ్పిటిసి సభ్యులు పైలా జగన్నాథ రావు , మండల పార్టీ అధ్యక్షులు బొడ్డపు శ్రీనివాసరావు, వియ్యపు చిన్నా గ,మాజీ సర్పంచ్ కన్నూరి వెంకటరమణ ,మోటూరు సన్యాసి నాయుడు ఉపాధ్యక్షులు వెన్నెల నరసింహారావు, వర్రీ పరదేశి నాయుడు,మండల ప్రధాన కార్యదర్శి కరణం నరసింహారావు మాజీ కార్పొరేటర్ దుల్లా రామనాయుడు, పైలా రామ చంద్రరావు,వార్డు అధ్యక్షులు పిల్లా శివ కృష్ణ, నాగిరెడ్డి చిన్నారావు, వెలుగుల అనిల్ ,అయ్యబాబు ,బొండా పవన్ కళ్యాణ్ ,సతివాడ జ్యోతి ,పావని తదితర పెందుర్తి మండలం ఉమ్మడి ఎన్ డి ఏ మహాకూటమి నాయకులు కార్యకర్తలు మహిళలు గ్రామ పెద్దలు ఆలయ కమిటీ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో తొలి ఏకాదశి పూజలు



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో ఆలయ ప్రధాన అర్చకులు ఘంటసాల సుబ్రహ్మణ్య శర్మ వారి శిష్య బృందం చే ఉదయం సుప్రభాతం,మూల విరాట్ కు రుద్రాభిషేకం, అభిషేకం లు నిర్వహించినారు. వచ్చిన భక్తులందరికీ ఆలయ కమిటీ వారు ప్రసాదం వితరణ చేసినారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు చీదెళ్ళ వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి సముద్రాల ప్రభాకర్, కోశాధికారి కొత్త సుబ్బారావు ఆలయ కమిటీ సభ్యులు, ఆర్యవైశ్య సంఘం సభ్యులు ఆర్యవైశ్య మహిళ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# అభ్యాస్ విద్యాపీఠం పాఠశాల గుర్తింపును వెంటనే రద్దు చేయాలి

- **గుర్తింపు లేకుండా చౌదరిగుడా మండలంలో నడుస్తున్నటువంటి ప్రైవేటు పాఠశాలలపై ఎంఈఓ, డీఈఓ స్పందించి గుర్తింపులను రద్దు చేయాలి**
- **అబ్యాస్ విద్యాపీఠం పాఠశాలను ముట్టడించి ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు**
- **ప్రాణాలు పోతే తప్ప పట్టించుకోరా ప్రభుత్వ అధికారులకు ఎస్ఎఫ్ఐ డిమాండ్**
- **ఎస్ఎఫ్ఐ షాద్ నగర్ డివిజన్ కార్యదర్శి వడ్ల శ్రీకాంత్**

**జయభేరి, షాద్ నగర్, జులై 25 :**



రంగారెడ్డి జిల్లా చౌదర్‌గూడ మండలం కాస్లాబాద్ గ్రామంలో స్కూల్ బస్సు కింద పడి యూకేజీ విద్యార్థిని సహస్ర మృతి చెందిన ఘటనపై ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. అబ్యాస్ విద్యాపీఠం పాఠశాల ముందు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి, పాఠశాల యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ షాద్నగర్ డివిజన్ కార్యదర్శి వడ్ల శ్రీకాంత్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ.. పాఠశాల యాజమాన్యం, బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే అమాయక విద్యార్థిని ప్రాణాలు కోల్పోయిందని ఆరోపించారు. ఘటనకు బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, మృతిచెందిన చిన్నారి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అబ్యాస్ విద్యాపీఠం పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని కోరారు. కాస్లాబాద్ గ్రామానికి చెందిన కృష్ణయ్య-మనీష దంపతుల కుమార్తె సహస్ర అబ్యాస్ విద్యాపీఠం పాఠశాలలో యూకేజీ చదువుతోంది. శుక్రవారం సాయంత్రం ఇంటి వద్ద బస్సు నుంచి దిగిన అనంతరం జరిగిన ప్రమాదంలో చిన్నారి మృతి చెందింది. ఇంటి వద్ద చిన్నారిని దించిన తర్వాత డ్రైవర్ బస్సును వెనక్కి తీస్తున్న సమయంలో వాహనం వెనుక ఉన్న సహస్రను గమనించకపోవడంతో ప్రమాదం జరిగినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తీవ్రంగా గాయపడిన చిన్నారిని కుటుంబ సభ్యులు, స్థానికులు షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై ఆందోళన నిర్వహించిన ఎస్ఎఫ్ఐ నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ షాద్నగర్ టౌన్ ఉపాధ్యక్షులు అదిల్ మరియు ఎస్ఎఫ్ఐ నాయకులు రామ్ చరణ్, రేవంత్,లోకేష్,వంశీ, ప్రశాంత్, నబి తదితరులు పాల్గొన్నారు.



## చలో పెనుగొండ యాత్ర





**జయభేరి, దేవరకొండ :**

వాసవి వనిత క్లబ్ గ్రేటర్ దేవరకొండ ఆధ్వర్యంలో చలో పెనుగొండ యాత్ర ఘనంగా నిర్వహించారు. ఆర్యవైశ్యుల కులదైవమైన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి అమ్మవారికి ఆషాడ మాసం సందర్భంగా ఒడిబియ కార్యక్రమాన్ని నిర్వహించారు అదేవిధంగా ప్రతి సంవత్సరం వాసవి క్లబ్ ఆధ్వర్యంలో చలో పెనుగొండ యాత్ర నిర్వహించి కులదైవం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవిని దర్శించి ఒడిబియ కార్యక్రమాన్ని నిర్వహించిన పెనుగొండ వాసవి క్లబ్ సభ్యులు దేవరకొండ వాసవి వనిత క్లబ్ సభ్యులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వాసవి వనిత క్లబ్ అధ్యక్షురాలు పందిరి జ్యోతి వాసవి క్లబ్ కోశాధికారి పందిరి వెంకన్న డిస్టిక్ జాయింట్ సెక్రటరీ నీల సంజీవ్ కుమార్ ఉప్పల శ్రీనివాసులు గుండా రాజారావు నాగమల్ల హరిబాబు వాసవి వనిత క్లబ్ సభ్యులు ఉప్పల శ్రీలత కుంచకూరి సంధ్యారాణి రాష్ట్ర ఆర్యవైశ్య మహిళా విభాగ్ కార్యవర్గ సభ్యులు కర్నాటి శాంత కుమారి విజయ ధనలక్ష్మి ఆర్యవైశ్య సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## జనార్ధన్ రెడ్డి ప్రథమ వర్ధంతి లో పాల్గొన్న ఎమ్మెల్యే

- **పాలకుర్తి శాసనసభ్యురాలు మామిడాల యశస్విని ఝాన్సీ రెడ్డి**



**జయభేరి, తొర్రూర్, జూలై 25 :**

కాంగ్రెస్ నాయకుడు కేతిరెడ్డి నరేష్ రెడ్డి తండ్రి కేతిరెడ్డి జనార్ధన్ రెడ్డి ప్రథమ వర్ధంతిలో పాలకుర్తి శాసన సభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డి పపాల్గొన్నారు. అనంతరం కీర్తిశేషులు అయిన జనార్ధన్ రెడ్డి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘన నివాళులర్పించారు. తధానంతరం నరేష్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ కీర్తిశేషులు అయిన జనార్ధన్ రెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని ఆమె దేవుడిని ప్రార్థించారు. పాలకుర్తి నియోజకవర్గం లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు, ఎలాంటి కష్టం వచ్చినా అన్నివేళలా అండగా ఉంటానని ఆమె అన్నారు. అదేవిధంగా ఇలాంటి, సంఘటనలు జరిగినప్పుడు పార్టీ కార్యకర్తలు నాయకులు బాధిత కుటుంబాలకు భరోసా కల్పించాలని ఆమె ఈ సందర్భంగా సూచించారు. అదేవిధంగా కేతిరెడ్డి కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటానని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో తొర్రూర్ మున్సిపల్ చైర్మన్ తూనం శ్రావణ్, వైస్ చైర్మన్, సోమ రజిని రాజశేఖర్, కాంగ్రెస్ పార్టీ మాజీ ఎంపీటీసీ జక్కా మహబూబ్ రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, పట్టణ అధ్యక్షులు ముద్దసాని సురేష్, పార్టీ సీనియర్ నాయకులు, యువజన నాయకులు, వార్డు కౌన్సిలర్లు, తదితరులు, పాల్గొన్నారు.

## కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా దేశ విద్యార్థుల ఘనవిజయం

- **రాష్ట్ర ఉపాధ్యక్షులు పంతం విజయేందర్, వెలిశాల శ్యామ్**

**జయభేరి, దంతాలపల్లి, జూలై25 :**



కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నీట్ పేపర్ లీకేజీ తో వేలాదిమంది నీట్ విద్యార్థుల జీవితాలను ఆగం చేసి కొంతమంది విద్యార్థుల ఆత్మహత్యలకు కారణం అయిందని తెలంగాణ ఎస్సీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పంతం విజయేందర్ రాష్ట్ర కార్యదర్శి వెలిశాల శ్యామ్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడద్దని దేశ వ్యాప్తంగా విద్యార్థులు పెద్ద ఎత్తున ఢిల్లీలో ఆందోళన చేసి ఢిల్లీ బిజెపి ప్రభుత్వం మెడలు వంచి కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేసే వరకు విద్యార్థి సంఘాల పోరాటం చాలా గొప్పదని అభినందించారు.కేంద్ర ప్రభుత్వం ఎన్ని కుట్రలు పన్నిన పది రోజులుగా యువకులు ,విద్యార్థులు,ప్రతిపక్ష రాజకీయ పార్టీలు ,ప్రజా సంఘాలు ,కుల సంఘాలు ,అన్ని ఒక్కటై ఏక గొంతుగాపోరాటం చేస్తుంటే ఎన్నో నిర్బంధాలు విధిస్తూ లాఠీచార్జ్ చేసిన విద్యార్థులు ఢిల్లీలో నిరంతరం ఆందోళన కార్యక్రమాలు చేయడం ద్వారానే నేడు బిజెపి ప్రభుత్వం గత్యంతరం లేక విద్యాశాఖ మంత్రితో రాజీనామా చేపించిందని ఇది విద్యార్థుల ఘనవిజయమని ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్నటువంటి పరీక్షలకు లీకేజీ కాకుండా చూసుకొని విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడకుండా ఉండాలని కోరారు. విద్యార్థులతో పెట్టుకుంటే ఏ ప్రభుత్వమైనా పతనమవుతుందని ఈ సందర్భంగా హెచ్చరించారు.

## హరి హర క్షేత్రంలో వైభవంగా శాకాంబరి ఉత్సవం



**జయభేరి, పరకాల, జులై 25:**

తొలి ఏకాదశి సందర్భంగా పరకాల పట్టణంలోని హరి హర క్షేత్ర అయ్యప్పస్వామి ఆలయంలో శాకాంబరి ఉత్సవాన్ని ఆలయ కమిటీ శనివారం వైభవంగా నిర్వహించింది. సకల దేవతా నిలయంగా ప్రసిద్ధి చెందిన ఈ ఆలయానికి పరకాల పట్టణంతో పాటు పరిసర గ్రామాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తులు అయ్యప్పస్వామిని దర్శించుకోవడంతో పాటు ఆలయ ప్రాంగణంలోని శివాలయం, శ్రీ వెంకటేశ్వరస్వామి తదితర దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. శాకాంబరి ఉత్సవం సందర్భంగా ఆలయం భక్తులతో కిక్కిరిసిపోగా, భక్తుల గోవింద నామస్మరణలు, స్వామి శరణం నినాదాలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో మారుమోగింది. ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు తగిన ఏర్పాట్లు చేశారు.



# ఓటీటీలో దూసుకుపోతున్న మలయాళం థ్రిల్లర్..

ఓటీటీ వేదికలలో క్రైమ్ థ్రిల్లర్ సినిమాలకు కొదవే లేదు. ప్రతి క్షణం ట్విస్టులు, ఊపిరి బిగపట్టే సస్పెన్స్ ఉన్న సినిమాలు ఇప్పుడు ఓటీటీలో దూసుకుపోతున్నాయి. అలాంటి వాటిలో ఈ క్రైమ్ థ్రిల్లర్ సినిమా ఒకటి. మనం మాట్లాడుకుంటున్న ఆ మూవీ పేరు అనోమీ. మలయాళంలో ఈ ఏడాది వచ్చిన బెస్ట్ థ్రిల్లర్ సినిమాల్లో ఇది ఒకటి. డైరెక్టర్ రియాస్ మరాథ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాల్లో ఒకప్పటి హీరోయిన్ భావన, రెహ్మాన్ లు ప్రధాన పాత్రలలో నటించారు. అయితే ఈసినిమాకు థియేటర్లలో అంతగా రెస్పాన్స్ రాలేదు. కానీ ఇప్పుడు ఇదే మూవీ ఓటీటీలో మాత్రం దుమ్మురేపుతుంది. స్లోగా సాగుతున్నప్పటికీ దాదాపు 2 గంటలు ప్రేక్షకులను సీటు అంచున కూర్చొపెడు తుంది. ముఖ్యంగా సస్పెన్స్ ఎక్కువగా ఇష్టపడే వారికి మంచి కిక్కిచ్చే సినిమా ఇది. ప్రస్తుతం ఈ మూవీ ప్రముఖ ఓటీటీ ప్లాట్ ఫామ్ అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ అవుతుంది. అయితే ఇది తెలుగు వెర్షన్ అందుబాటులో లేదు. అయినప్పటికీ ఈ మూవీ మాత్రం ప్రేక్షకులను సులభంగానే అర్థమవుతుంది. చాలా గ్రిప్పింగా ఈ క్రైమ్ థ్రిల్లర్ సాగుతుంది. ప్రతి సీన్ మిమ్మల్ని కట్టిపడే స్తుంది. ఈ సినిమాలోని ప్రతి ట్విస్టు, సస్పెన్స్ ఊహించని విధంగా సాగుతూ ఉంటుంది.



# అఖిల్‌కు అమెరికా పౌరసత్వం..

## త్వరలో భారతీయుడిని అవుతానన్న హీరో

అక్కినేని అఖిల్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. బాలనటుడిగా సినీ ప్రయాణాన్ని ప్రారంభించిన ఆయన, హీరోగా తనకంటూ ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్నారు. తాజాగా విడుదలైన 'లెనిన్' సినిమాతో కెరీర్‌లోనే అతిపెద్ద విజయాన్ని అందుకున్న అఖిల్ ఇప్పుడు మరో కారణంతో వార్తల్లో నిలిచారు. ఈసారి ఆయన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఆసక్తికరమైన విషయం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.ఇటీవల ఓ పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో పాల్గొన్న అఖిల్ తన పౌరసత్వంపై తొలిసారిగా స్పష్టత ఇచ్చారు. ప్రస్తుతం తాను అమెరికా పౌరుడినేనని, అయితే త్వరలోనే భారతీయ పౌరసత్వాన్ని స్వీకరించనున్నట్లు వెల్లడించారు. అఖిల్ 1994 ఏప్రిల్ 8న అమెరికాలోని కాలిఫోర్నియా రాష్ట్రం సాన్ జోస్ నగరంలో జన్మించారు. అక్కడి చట్టాల ప్రకారం అమెరికాలో జన్మించిన కారణంగా ఆయనకు అమెరికా పౌరసత్వం లభించింది. ప్రస్తుతం ఆయన వద్ద అమెరికా పాస్‌పోర్ట్ కూడా ఉంది. అయితే చిన్నప్పటి నుంచే భారతదేశంలో పెరిగిన అఖిల్ తన విద్యలో ఎక్కువ భాగాన్ని హైదరాబాద్‌లో పూర్తి చేశారు. అనంతరం ఆస్ట్రేలియాలో చదివి, నటనపై ఆసక్తితో అమెరికాలోని న్యూయార్క్‌లో యాక్టింగ్‌లో ప్రత్యేక శిక్షణ పొందారు. అయితే తాజా ఇంటర్వ్యూలో "మీరు అమెరికన్ సిటిజనా? లేక ఇండియన్ సిటిజనా?" అనే ప్రశ్నకు అఖిల్ ఆసక్తికరంగా స్పందించారు. "ప్రస్తుతం నేను అమెరికా పౌరుడిని. నా దగ్గర అమెరికా పాస్‌పోర్ట్ ఉంది. అయితే ఆ పౌరసత్వాన్ని వదులుకునే ప్రక్రియలో ఉన్నాను. ఇంకొన్ని నెలల్లో పూర్తిగా భారతీయ పౌరుడిని అవుతాను. ఏ దేశం పౌరసత్వం ఉన్నా నా మనసు మాత్రం ఎప్పుడూ భారతదేశానిదే. నేను ఇండియన్... మేరా భారత్ మహాన్" అంటూ తన దేశభక్తిని వ్యక్తం చేశారు.అఖిల్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. అభిమానులు కూడా ఆయన నిర్ణయాన్ని ప్రశంసిస్తూ స్పందిస్తున్నారు. ఇక సినీ కెరీర్ విషయానికి వస్తే.. బాలనటుడిగా 'సిసింద్రీ' సినిమాతో ప్రేక్షకులను అలరించిన అఖిల్, ఆ తర్వాత 'మనం' చిత్రంలో అతిథి పాత్రలో కనిపించారు. 2015లో 'అఖిల్' సినిమాతో హీరోగా ఎంట్రీ ఇచ్చిన ఆయన, 'హలో', 'మిస్టర్ మజ్ను', 'మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్', 'ఏజెంట్' వంటి చిత్రాల్లో నటించారు. తాజాగా విడుదలైన 'లెనిన్' సినిమాతో బాక్సాఫీస్ వద్ద ఘన విజయం సాధించి తన కెరీర్‌లోనే అత్యుత్తమ హిట్‌ను ఖాతాలో వేసుకున్నారు.

# శ్రీశ్రీ స్వరాలాపన




వెర్సటైల్ హీరో దుల్కర్ సల్మాన్ నటిస్తున్న 'ఆకాశంలో ఒక తార' చిత్రం త్వరలో విడుదల కానున్నది. ఈ సినిమా తర్వాత ఆయన చేస్తున్న మరో తెలుగు సినిమా 'శ్రీశ్రీ'. పూజా హెగ్డే కథానాయిక. రవి నెలకుదిటి దర్శకుడు. చెరుకూరి సుధాకర్ నిర్మాత. ఇషాన్ సక్సేనా సహ నిర్మాత. మ్యూజిక్ ప్రమోషన్స్‌లో భాగంగా ఈ సినిమాలోని ఫస్ట్ సింగిల్‌ని ఈ నెల 27న విడుదల చేయనున్నారు. 'బొమ్మ.. బొమ్మ' అంటూ సాగే ఈ పాటకు సంబంధించిన పోస్టర్‌ని మేకర్స్ శనివారం విడుదల చేశారు. ట్రెక్కింగ్ కాస్ట్యూమ్స్‌లో కొండ ప్రాంతంలోని బ్రిడ్జ్‌పై నడుస్తూ కనిపిస్తున్న దుల్కర్, పూజా హెగ్డేలను ఈ పోస్టర్‌లో చూడొచ్చు. వారి సహజమైన కెమిస్ట్రీ, చిరునవ్వులు పోస్టర్‌కి ఫ్రెష్ ఫీల్‌ని తీసుకొచ్చాయి. ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాశ్‌కుమార్, నిర్మాణం: ఎస్వీఎల్‌వీ సినిమాస్.



# నా సక్సెస్ చూడకుండానే వెళ్లిపోయింది..

యంగ్ హీరో కిరణ్ అబ్బవరం, శ్రీ గౌరీ ప్రియ జంటగా నటించిన లేటెస్ట్ మూవీ చెన్నై లవ్ స్టోరీ. జూలై 24న థియేటర్లలో విడుదలైన ఈ సినిమాకు పాజిటివ్ రెస్పాన్స్ వచ్చింది. ఈ క్రమంలోనే ఈ చిత్రం బ్లాక్‌బస్టర్ విజయాన్ని సాధించిన నేపథ్యంలో శ్రేయాస్ మీడియా నిర్వహించిన సక్సెస్ మీట్‌లో కథానాయిక శ్రీ గౌరీ ప్రియ మాట్లాడుతూ ఎమోషనల్ అయ్యారు. ఈ విజయం తనకెంతో ప్రత్యేకమని, కొంత భావోద్వేగంగా ఉన్నానని ఆమె తెలిపారు. తన దివంగత తల్లిని గుర్తుచేసుకుంటూ, తన సక్సెస్ తన తల్లి చూసుంటే ఎంతో సంతోషించేవారని పేర్కొన్నారు. అయితే, తన తల్లి తనను చూస్తోందని, ఆమె ఆశీస్సుల వల్లే ఈ పేరు వచ్చిందని గౌరీ ప్రియ అన్నారు. తల్లిదండ్రుల మద్దతు లేకుండా తాను ఏదీ సాధించలేనని, తన తండ్రికి కూడా కృతజ్ఞతలు తెలిపారు. "ఇంతటి మంచి పేరు, సక్సెస్ వస్తున్న ఈ సమయంలో మా అమ్మ నా పక్కన ఉండి ఉంటే ఎంతగానో సంతోషించేది. నన్ను ఇలా చూసి ఉంటే ఎంత బాగుండేదో అని చుట్టుపక్కల అందరూ అంటున్నారు. కానీ నాకు తెలుసు.. నా అమ్మ ఎప్పటికీ పైనుంచి నన్ను చూస్తూ ఆశీర్వదిస్తూనే ఉంటుంది" అంటూ భావోద్వేగానికి గురైంది.

# విశ్వనాథ్ & సన్స్ చిత్రం నుంచి 'ది వెడ్డింగ్ సాంగ్' రిలీజ్



తమిళ అగ్ర కథానాయుడు సూర్య ప్రధాన పాత్రలో ప్రతిభగల దర్శకుడు వెంకీ అట్లూరి రూపొందిస్తోన్న చిత్రం 'విశ్వనాథ్ & సన్స్'. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు. జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం నుంచి ఇప్పటికే విడుదలైన తొలి గీతం 'నేనో బటర్‌ఫ్లై' విశేషంగా ఆకట్టుకుంది. ఆ ఉత్సాహంతో 'విశ్వనాథ్ & సన్స్' చిత్ర బృందం, 'ది వెడ్డింగ్ సాంగ్' రూపంలో అభిమానులకు మరో కానుకను తీసుకొచ్చింది. ఈ రెండవ గీతం విడుదలైన తక్షణమే అందరినీ అలరిస్తూ, అసలుసిసలైన వేడుకల గీతంగా ప్రశంసలు అందుకుంటోంది. ఉత్సాహభరితమైన, పండుగ వాతావరణాన్ని తలపించే ఈ పాటలో.. సూర్య, మమితా బైజు తమ అద్భుతమైన నృత్యంతో తెరపై వెలుగులు నింపుతూ, ఒక ఘనమైన కుటుంబ వివాహంలోని ఆనందాన్ని, ఆత్మీయతను కళ్ళకు కట్టినట్లు చూపించారు. ఈ పాటను సూర్య స్వయంగా ఆలపించడం మరింత ప్రత్యేకంగా, హృదయానికి హత్తుకునే సంగీత అనుభూతిగా మార్చింది.

ఈ గీతానికి జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం సమకూర్చగా, రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించారు. ఈ అద్భుతమైన సంగీత సాహిత్య కలయిక, పాటకు సంబరాల అనుభూతిని జోడించింది. కేవలం ప్రకటనతోనే 'విశ్వనాథ్ & సన్స్' సినిమాపై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. పోస్టర్లు, టీజర్ ఆకట్టుకోవడంతో పాటు.. 'నేనో బటర్‌ఫ్లై', 'ది వెడ్డింగ్ సాంగ్' వంటి వరుస చార్ట్‌బస్టర్లతో ఈ సినిమాపై అంచనాలు రోజురోజుకి పెరుగుతున్నాయి. ఈ కుటుంబ కథా చిత్రం స్వాతంత్ర్య దినోత్సవం కానుకగా ఒకరోజు ముందుగా ఆగస్టు 14, 2026 న ప్రపంచ వ్యాప్తంగా ఘనంగా థియేటర్లలో విడుదల కానుంది. తారాగణం: సూర్య, మమితా బైజు, రాధికా శరత్‌కుమార్, రవీనా టాండన్ తదితరులు

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at **Sri Muktheswara Publications**, Plot No. 31, Mallikarjuna Nagar Colony, Sagar Ring Road, Bairamal Guda, Hyderabad-500079, Dist. Rangareddy, Telangana. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889**. **PRGI No: TGTEL/25/A0314**. email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**